ఈనాడు
అనకాపల్లి
మంగళవారం 22 అక్టోబరు 2024

విశాఖలో ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



రుషికొండ భవన సముదాయ పరిసరాలను ఫొటో తీస్తున్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్

విశాఖపట్నం, న్యూస్‌టుడే: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌కు సోమవారం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఉప ముఖ్యమంత్రి పదవి చేపట్టాక తొలి సారి విశాఖ వచ్చిన పవన్‌కు స్వాగతం పలకడానికి ఎంపీ ఎం.శ్రీభరత్, జిల్లా కలెక్టర్ హరేంధిరప్రసాద్, జీవీఎంసీ కమిషనర్ సంపత్ కుమార్, కూటమి నాయకులు తరలివచ్చారు. అనంతరం రోడ్డు మార్గాన విజయనగరం జిల్లా గుర్ల మండలం వెళ్లారు. అక్కడ పర్యటన ముగించుకుని సాయంత్రం రుషికొండకు వెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో జగన్ నిర్మించిన భవంతులను పరిశీలించారు. అక్కడ పనిచేస్తున్న కూలీలతో మాట్లాడి ప్రభుత్వ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు.



రుషికొండలో కూలీలతో మాట్లాడుతున్న ఉప ముఖ్యమంత్రి

డీఎస్సీ ఉచిత శిక్షణకు 25 వరకు గడువు పెంపు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ పరీక్షకు ఉచిత శిక్షణ, వసతితో మూడు నెలలపాటు శిక్షణ పొందేందుకు ఈనెల 25 వరకు దరఖాస్తు గడువు పెంచామని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి కె.రాజేశ్వరి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ పోర్టల్‌లో దరఖాస్తు నమోదు చేసుకోవాలన్నారు. శిక్షణ ఇవ్వడానికి ఆసక్తి ఉన్న సంస్థలు దరఖాస్తు చేసుకోవడానికి 25 వరకు గడువు పభుత్వం కల్పించిందన్నారు.

■ అచ్యుతాపురం మండలం ఎం.జగన్నాథపురం ప్రాథమిక పాఠశాల నాలుగేళ్ల క్రితం 103 మంది విద్యార్థులు ముగ్గురు ఉపాధ్యాయులతో నిండుగా ఉండేది. విలీనం తర్వాత ఆ పాఠశాలలో ప్రస్తుతం 11 మంది పిల్లలు మాత్రమే ఉన్నారు.

■ దేవరాపల్లి మండలం తెనుగుపూడి పాఠశాలలో ఇదివరకు 58 పిల్లలుంటే ఇప్పుడు ఏడుగురు మాత్రమే చదువుతున్నారు.

■ ఎస్.రాయవరం మండలం కర్రివీధి పాఠశాలలో విలీనానికి ముందు 36 మంది పిల్లలు చదివేవారు. ప్రస్తుతం ఆ పాఠశాలలో కేవలం ముగ్గురు విద్యార్థులే ఉన్నారు.

■ పెదబయలు మండలం పెదవంచరంగి, రాగోలుపేట స్కూళ్లలో 6, 13 మంది చొప్పున పిల్లలు చదువుతున్నారు.

■ దేవరాపల్లి మండలం సీతంపేట, ఎండపల్లిపాలెం, బేతపూడి పాఠశాలలో ఒక్క విద్యార్థి కూడా లేరు.

గదులు సరిపడక ఇబ్బంది

ఉపాధ్యాయులు మొత్తుకున్నా వినకుండా గత ప్రభుత్వం జీఓ నం. 117 విద్యావ్యవస్థపై బలవంతంగా రుద్దింది. 3, 4, 5 తరగతుల నుంచి ఉన్నత పాఠశాలలకు విద్యార్థులు రావడం వల్ల గదులు సరిపడక ఇబ్బంది పడ్డారు. దీనికి తోడు ఉన్నత పాఠశాలల్లో ఉండే తెలుగు మాధ్యమాన్ని తొలగించడంతో ఒక్క పీరియడ్ ఖాళీ లేకుండా బోధన చేసినా సమయం సరిపోయేది కాదు. రద్దును స్వాగతిస్తున్నాం.



– రొబ్బి లక్ష్మి, ఉపాధ్యాయిని, వెంకటాపురం

విలీనం నుంచి విముక్తి!

ఈనాడు, అనకాపల్లి అచ్యుతాపురం, న్యూస్‌టుడే

1, 2, 3, 4, 5 ఇవేవో ర్యాంకులు కాదు... గత వైకాపా సర్కారు విద్యా సంస్కరణల ఫలితంగా చాలా ప్రాథమిక పాఠశాలల్లో ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల సంఖ్యలు. 3, 4, 5 తరగతులను సమీపంలోని ఉన్నత పాఠశాలల్లో విలీనం చేస్తూ గత వైకాపా ప్రభుత్వం 2021లో నిర్ణయం తీసుకుంది. 'బడుల విలీనం వద్దు.. పిల్లలను దూరాభారం పంపించలేం' అంటూ తల్లిదండ్రులు ఆందోళనలు చేసినా నాటి ప్రభుత్వం వెనక్కి తగ్గలేదు. ఫలితంగా పేద విద్యార్థులు ఇంటి నుంచి ఎంతో దూరంగా ఉండే ఉన్నత పాఠశాలలకు కిలోమీటర్ల కొద్దీ నడుస్తూ రాకపోకలు సాగించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 302 ప్రాథమిక పాఠశాలల్లో 3, 4, 5 తరగతులను సమీప ఉన్నత పాఠశాలల్లో విలీనం చేశారు. అనకాపల్లి జిల్లాలో 129 పాఠశాలల విద్యార్థులు హైస్కూళ్లకు వెళ్లాల్సి వచ్చింది. ఈ నిర్ణయం కారణంగా సర్కారు బడుల్లో చేరికలు గణనీయంగా తగ్గిపోయాయి. విద్యావ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైంది. చాలా పాఠశాలల్లో ఈ ఏడాది పదిమంది లోపే విద్యార్థులు మిగిలారు. వచ్చే ఏడాదికి ఈ పాఠశాలలు చరిత్రలో కలిసిపోయే పరిస్థితి ఏర్పడింది.

● జీఓ నం. 117 రద్దుతో ప్రాథమిక విద్యకు ఊపిరి
● కూటమి సర్కారు నిర్ణయంపై ఉపాధ్యాయ సంఘాల హర్షం

అనకాపల్లి జిల్లాలో మొత్తం పాఠశాలలు: 1,885
20 మంది లోపు పిల్లలున్నవి : 235
ఈ ఏడాది ఒక్క విద్యార్థీ చేరని బడులు: 10
పది మందిలోపు విద్యార్థులతో నడుస్తున్నవి: 296



ఎస్.రాయవరంలో ఒక విద్యార్థికే బోధిస్తున్న ఉపాధ్యాయిని (పాతచిత్రం)

రూ. కోట్లు ఖర్చు చేసినా..

నాడు-నేడు పేరుతో వైకాపా సర్కారు రూ. కోట్లు ఖర్చుచేసినా సర్కారు బడుల్లో చేరేవారే కరవయ్యారు. పాలకుల నిర్ణయాల్లో ముందుచూపు కొరవడిన కారణంగా ప్రభుత్వ బడుల నుంచి ప్రైవేటు స్కూళ్లకు విద్యార్థులు వలస వెళ్లిపోయారు. గత నాలుగేళ్లలో ఉమ్మడి జిల్లాలో 40 వేల మంది పిల్లలు ప్రభుత్వ పాఠశాలలను వీడిపోయారు. ఏటా పదుల సంఖ్యలో సర్కారు బడులు మూతపడుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన వెంటనే ఈ దుస్థితిని గుర్తించి ఇప్పటికిప్పుడు మార్పులు చేస్తే ఇబ్బందులు ఎదురవుతాయని భావించి, వచ్చే ఏడాది నాటికి పరిస్థితులను మార్చే దిశగా అడుగులు వేస్తోంది. ఉపాధ్యాయ సంఘాలు, తల్లిదండ్రుల కమిటీ అభిప్రాయాలను తీసుకుని జీఓ నం. 117 రద్దుకు నిర్ణయించింది.

కూటమి సర్కారు వచ్చాక విద్యావ్యవస్థను గాడిలో పెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. అరకొర జ్ఞానంతో సీబీఎస్ఈలో పదోతరగతి పరీక్షలు రాయనవసరం లేదని ఈ ఏడాదికి రద్దు చేశారు. తాజాగా జీఓ నం. 117 రద్దు చేసి ప్రాథమిక విద్యకు ఊపిరి పోయాలని నిర్ణయించింది. దీంతో వందల పాఠశాలలకు విలీనం నుంచి విముక్తి లభించనుంది. వచ్చే ఏడాది నుంచి ఆయా పాఠశాలల్లో మరలా 3, 4, 5 తరగతులు మొదలుకానున్నాయి.



ముగ్గురు విద్యార్థులకు బోధిస్తున్న ఇద్దరు ఉపాధ్యాయులు

ప్రాథమిక విద్యకు మేలు..

ప్రభుత్వం జీఓ నం. 117 రద్దు చేయాలని నిర్ణయానికి రావడం చాలా సంతోషం. దీనివల్ల ప్రాథమిక విద్యకు మేలు జరగనుంది. గతంలో 3, 4, 5 తరగతులను విలీనం చేయడం వల్ల ప్రాథమిక పాఠశాలలు చాలావరకు పది మంది పిల్లలు కూడా ఉండడం లేదు. ప్రభుత్వ పాఠశాలల్లో చేరేవారు కూడా తగ్గిపోయారు. కూటమి ప్రభుత్వం నిర్ణయంతో మరలా ప్రభుత్వ పాఠశాలల్లో చేరికలు పెరుగుతాయి.

– ఇ.పైడిరాజు, ఎస్టీయూ, విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి

మంచి నిర్ణయమే..

వచ్చే ఏడాది నుంచి జీఓ నం. 117 అమలు చేయమని ప్రభుత్వం చెబుతోంది. ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిలో పాత విధానాన్ని తీసుకురావాలి. ఏ పాఠశాల మూతపడకుండా ఉండేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో చర్యలు తీసుకోవాలి.

– చిన్నబ్బాయ్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి



దేవరాపల్లి మండలంలో పిల్లలు చేరక మూతపడిన సీతమ్మపేట ప్రాథమిక పాఠశాల



పోలీస్ అమరవీరుల స్తూపం వద్ద నివాళి అర్పిస్తున్న కలెక్టర్


పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని కలెక్టర్ విజయకృష్ణన్ అన్నారు. ఎస్పీ కార్యాలయం వద్ద అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు ఆధ్వర్యంలో సోమవారం పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసులకు నివాళి అర్పించారు. పోలీస్ స్మృతి పరేడ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధి నిర్వహణ, శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా ప్రాణాలు అర్పించిన పోలీసులను స్ఫూర్తిగా తీసుకుని సిబ్బంది పనిచేయాలని సూచించారు. ప్రాణాలు అర్పించిన పోలీసుల త్యాగాన్ని ఎప్పటికీ మరిచిపోమని, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పోలీస్ కుటుంబ సభ్యులకు ఎలాంటి సమస్య ఉన్నా పరిష్కరిస్తామని చెప్పారు. పోలీస్ సిబ్బంది విధులతోపాటు ఆరోగ్యంపైనా దృష్టి పెట్టాలని సూచించారు. అదనపు ఎస్పీ క్రైం ఎల్.మోహనరావు మాట్లాడుతూ ఈ ఏడాది దేశవ్యాప్తంగా 216 మంది, రాష్ట్రంలో ఇద్దరు పోలీసులు విధి నిర్వహణలో తమ ప్రాణాలను అర్పించారన్నారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, ఓపెన్ హౌస్, రక్తదాన శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 1983 నుంచి 2024 వరకు అమరులైన 13 మంది పోలీస్ కుటుంబ సభ్యులకు జ్ఞాపిక, నగదు బహుమతి అందజేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ నాగేశ్వరరావు, డీఎస్పీలు అప్పారావు, కె.వి.సత్యనారాయణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

★ అనకాపల్లి ఎస్పీగా సోమవారం బాధ్యతలు చేపట్టిన తుహిన్ సిన్హా సైతం పోలీస్ అమరవీరులకు నివాళి అర్పించారు. ముందుగా కార్యాలయానికి వచ్చిన ఆయనకు పోలీసులు గౌరవ వందనం పలికారు.

గంజాయి కట్టడికే తొలి ప్రాధాన్యం

ఎస్పీగా తుహిన్ సిన్హా బాధ్యతల స్వీకారం



అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజలకు సిబ్బందితో పాటుగా తానూ నిరంతరం అందుబాటులో ఉంటూ పోలీస్‌పరంగా మెరుగైన సేవలు అందించేలా చొరవ చూపుతామని నూతన ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. అనకాపల్లి ఎస్పీ కార్యాలయంలో సోమవారం విధుల్లో చేరిన అనంతరం విలేకరులతో మాట్లాడారు. తనకు జిల్లాపై పూర్తి అవగాహన ఉందన్నారు. 2017 బ్యాచ్‌కు చెందిన తాను విశాఖపట్నం డీసీపీ-2గా, ఎన్నికల సమయంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా, 2021-22లో నర్సీపట్నం ఏఎస్పీగా పనిచేసినట్లు తెలిపారు. జిల్లాలో గంజాయి రవాణా అరికట్టేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటామని, ఇదే తన తొలి ప్రాధాన్యం అన్నారు. దీనిపై జిల్లాలో అధికారులతో మాట్లాడి ఎజెండా రూపొందిస్తామన్నారు. ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉండి సేవలు అందిస్తామన్నారు. గంజాయి, ఇసుక రవాణా, అసాంఘిక కార్యక్రమాలను అరికట్టేందుకు ప్రజల నుంచి సహకారం అవసరమన్నారు. జిల్లాలో సైబర్ నేరాలను అరికట్టేలా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చేలా అవగాహన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

★ విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టిని ఆయన కార్యాలయంలో ఎస్పీ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం కలెక్టర్ విజయను కలిసి పూల మొక్కను అందజేశారు.

అనుమతులా.. అవేం ఉండవ్!

అనకాపల్లి, న్యూస్‌టుడే: చిన్న షెడ్ వేస్తే ఎంతో హడావుడి చేసే ప్రణాళికా విభాగం అధికారులు ఎటువంటి అనుమతులు లేకుండా బహిరంగంగా భారీ భవంతులు కడుతున్నా మౌనం వహిస్తున్నారు. పెరుగుబజారు రహదారి విస్తరణలో భాగంగా 112 భవనాలు తొలగించారు. మరో 27 ఖాళీ స్థలాలు ఉన్నాయి. రహదారి విస్తరణ చేయడంతో మొత్తం 139 మంది నూతన భవనాలు నిర్మిస్తున్నారు. వీరిలో వందకు పైగా ఎటువంటి అనుమతులు లేకుండానే నిర్మాణాలు చేస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. బ్యాంకు రుణాలు వంటి అవసరాలు ఉన్న వారితో పాటు మరికొంత మంది నిర్మాణాలకు జీవీఎంసీ ప్రణాళికా విభాగం నుంచి అనుమతులు తీసుకున్నారు. మిగిలిన వారు అనుమతులు తీసుకోకుండా రెండు, మూడు అంతస్తుల భారీ భవనాలు నిర్మిస్తున్నారు. ఒక్కొక్కరూ రూ. 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు జీవీఎంసీకి చెల్లించాల్సి ఉంది. దీనిని ఎగ్గొట్టేందుకు వైకాపా ప్రభుత్వ హయాంలో ఇక్కడ నిర్మాణాలు చేపట్టారు. ఆ సమయంలో ప్రణాళికా విభాగం అధికారి ఈ వ్యవహారంలో కీలక పాత్ర వహించారని తెలుస్తోంది. ఆయన ఇక్కడ పనిచేస్తున్న సమయంలోనే పదవీ విరమణ చేశారు. ఎలాగూ పదవీ విరమణ చేస్తున్నామనే ఉద్దేశంతో అనుమతులు లేకుండా నిర్మాణాలకు అవకాశం కల్పించినట్లు తెలుస్తుంది. దీనిపై ప్రణాళికా విభాగం అధికారి రామకృష్ణను వివరణ కోరగా అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.



పెరుగుబజారు రహదారిలో నిర్మిస్తున్న భవనాలు

ఏటికొప్పాకకు ఆపన్న హస్తం

ఉపాధి హామీలో అంకుడు పెంపకం

ఎలమంచిలి, న్యూస్‌టుడే

ప్రసిద్ధిగాంచిన ఏటికొప్పాక హస్తకళ మరింత వెలుగులీనేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంది. బొమ్మల తయారీలో అత్యంత కీలకమైన అంకుడు కర్ర లభ్యత తగ్గిపోవడంతో కళాకారులు ఎంతో ఇబ్బంది పడుతున్నారు. ఈ నేపథ్యంలో రానున్న రోజుల్లో ముడిసరకు కొరత రాకుండా ఉపాధి హామీ నిధులతో ప్రభుత్వ, ప్రైవేటు, అటవీ భూముల్లో అంకుడు కర్ర, తెల్లపాణిక చెట్లు పెంచాలని ఆదేశాలు జారీచేసింది. రెండు, మూడు తరాలకు సరిపడా చెట్లు పెంచాలనే ప్రణాళిక తయారు చేసి తక్షణం అమలు చేయాలని అధికారులకు ఆదేశాలు అందాయి. జిల్లాలో ఐదు వేల ఎకరాల్లో అంకుడు కర్ర మొక్కలు పెంచాలన్న ఆలోచనలో అధికారులున్నారు.



అంకుడు మొక్క ఇదే

లక్కబొమ్మల తయారీలో ఏటికొప్పాక జాతీయస్థాయిలో గుర్తింపు పొందింది. ఈ గ్రామంలో 250 కుటుంబాలకు చెందిన 500 మంది కళాకారులున్నారు. వీరిలో మహిళలు 160 మందికి పైగా ఉన్నారు. 200 సంవత్సరాలకు పైబడిన చరిత్ర ఏటికొప్పాక కళాకారులకు ఉంది. లక్కబొమ్మల తయారీకి సున్నితమైన అంకుడు కర్ర వాడతారు. గతంలో ఈ కర్ర పుష్కలంగా దొరికేది. విపరీతంగా చెట్ల నరికివేత కారణంగా ఇప్పుడీ కర్ర లభించడం లేదు. కూలీలు అడవుల్లోకి వెళ్లి చాలా దూరం నుంచి మోసుకురావాల్సి వస్తోంది. దీంతో ఖర్చు పెరిగిపోతోంది. గతంలో మోపు (పది కర్రల కట్ట) రూ. వెయ్యికి లభించేది. ఇప్పుడు దీని ధర రూ. 2500 లకు పెరిగింది. అంత ధర చెల్లించినా బొమ్మల తయారీకి సరిపడా లావు కర్ర దొరకడం లేదు. కలప వ్యయం పెరిగిన కారణంగా బొమ్మ తయారీ ఖర్చు మూడింతలు పెరిగింది. ఈ కారణంగా అమ్మకాలు తగ్గి కళాకారులు లాభాలు తగ్గించుకోవాల్సి వస్తోంది.



అపురూపమైన లక్కబొమ్మ



లక్కబొమ్మలు తయారు చేస్తున్న కళాకారులు

✦ అంకుడు కర్రపై అటవీశాఖ నిషేధం ఉంది. దీనిని తొలగించాలని చాలాకాలంగా కళాకారులు కోరుతున్నారు. గతంలో చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఏటికొప్పాకలో నదిగట్ల పక్కన, ఏటికొప్పాక చక్కెర కర్మాగారం వెనుక ఉన్న కొండపైనా అంకుడు కర్ర మొక్కలు నాటించారు. తరవాత వచ్చిన ప్రభుత్వం పట్టించుకోలేదు. ఇప్పుడు మళ్లీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవ చూపించారు. ఖాళీగా ఉన్న ప్రభుత్వ, అటవీ భూములతోపాటు రైతుల భూముల్లో ఉపాధి హామీ నిధులతో అంకుడు చెట్లు పెంచాలని నిర్ణయం తీసుకున్నారు.

మూడేళ్లలో కోతకు..

అంకుడు కర్ర మొక్క నాటిన మూడు సంవత్సరాలకు కోతకు వస్తుంది. కొమ్మలు నరికి చెట్టు అలా ఉంచితే మళ్లీ చిగురించి కొమ్మలు వేస్తుంది. అంకుడు కర్ర మొక్కలు విస్తారంగా పెంచి ప్రభుత్వమే తక్కువ ధరలకు కళాకారులకు కలప అందిస్తే ఈ రంగంలో మరింత మంది ఉపాధి పొందడానికి ముందుకు వస్తారు. ప్రభుత్వ తీసుకున్న నిర్ణయం కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపుతుంది

– శ్రీశైలపు చిన్నయాచారి, జాతీయ అవార్డు గ్రహీత, ఏటికొప్పాక

ఆదేశాలు అందాయి

ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చాయి. ఏటికొప్పాక పరిసర గ్రామాల్లో 1500 మందికి పైగా ఉపాధి హామీ కూలీలు ఉన్నారు. వీరితో ప్రభుత్వ స్థలాల్లో అంకుడు కర్ర మొక్కలు నాటించడానికి ప్రణాళికలు సిద్ధం చేస్తాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎంత విస్తీర్ణంలో పెంచాలన్నది నిర్ణయిస్తాం. రైతుల పొలాల్లో పెంచడానికి వారు అంగీకరిస్తే వారి భూముల్లోనూ పెంచుతాం. పక్వానికి వచ్చాక ఆ రైతులే కర్రను అమ్ముకుంటారు.

– శ్రీనివాస్, ఏపీఓ, ఎలమంచిలి

చిరస్థాయిగా నిలిచేలా తాండవ ఎత్తిపోతల: అయ్యన్న


నాతవరం, న్యూస్‌టుడే: 'యాభై ఏళ్ల రాజకీయ జీవితంలో చిరస్థాయిగా నిలిచిపోయేలా తాండవ ఎత్తిపోతల పథకాన్ని సాధించి ఆయకట్టు భూములను సస్యశ్యామలం చేస్తా'నని సభాపతి అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారు. పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా గొలుగొండపేట నుంచి వెదురుపల్లి వరకు రోడ్డు నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. ఎత్తిపోతలకు సంబంధించిన ప్రతిపాదనలను ఇప్పటికే ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేసినట్లు చెప్పారు. గబ్బాడ యార్డులో అక్రమంగా ఇసుక నిల్వ చేసిన సంస్థకు రూ. 20 కోట్ల జరిమానా విధించేలా చేశానన్నారు. ఈ ఇసుకను రవాణా ఛార్జీలు చెల్లించి ఎవరైనా తీసుకువెళ్లవచ్చని సూచించారు. నాతవరం మండలంలో రహదారుల అభివృద్ధిని వైకాపా ప్రభుత్వం గాలికొదిలేసిందని మండిపడ్డారు. వెదురుపల్లి, మన్యపురట్ల, కాకరాపల్లి రహదారుల నిర్మాణానికి రూ. 3 కోట్లు ఖర్చు చేయనున్నట్లు చెప్పారు. నాయకుల మధ్య కుమ్ములాటలు సరికాదని, పనిచేసే వారికే పదవులని స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరూ తెదేపా సభ్యత్వ నమోదుపై దృష్టి సారించాలని సూచించారు. ఆర్డీఓ రమణ, డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ అన్నపూర్ణాదేవి, నాయకులు సూర్యచంద్ర, సత్యనారాయణ, రమణ, సత్తిబాబు పాల్గొన్నారు.



గొలుగొండపేట సభలో మాట్లాడుతున్న సభాపతి అయ్యన్నపాత్రుడు

అడ్డంకులు అధిగమించి ఇసుక పంపిణీ

నర్సీపట్నం మండలం గబ్బాడ యార్డులో ఇసుక సరఫరాకు సంబంధించి సోమవారం ఉదయం సాంకేతిక సమస్య తలెత్తింది. తెదేపా నాయకుడు గవిరెడ్డి వెంకటరమణ ఈ విషయాన్ని రెవెన్యూ, గనుల శాఖ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఏడీ శివాజీ, ఆర్డీఓ వి.వి.రమణ హుటాహుటిన అక్కడకు చేరుకున్నారు. ఇసుక నిల్వలు ఉన్నట్లు ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో అప్పటికప్పుడు సంబంధిత అధికారులతో మాట్లాడి 120 టన్నులు విక్రయానికి ఉంచారు. కొంతమంది ట్రాక్టర్లకు జీపీఎస్ సదుపాయం ఏర్పాటు చేయలేదు. వారంతా ట్రాక్టరుకు రూ. 700 వరకు అదనంగా చెల్లించాల్సి వస్తోంది. ఆన్‌లైన్లో విక్రయాలు జరుగుతున్నందున యజమానుల బ్యాంకు ఖాతా, జీపీఎస్ తప్పనిసరిగా ఉండాలని అధికారులు సూచించారు. తహసీల్దారు రామారావు, రాయల్టీ ఇన్‌స్పెక్టర్ సత్యమూర్తి తదితరులు వెంట ఉన్నారు. గబ్బాడ యార్డులో మూడు రోజులుగా ఉచిత సరఫరా జరుగుతోంది. టన్నుకు రూ. 1165 చొప్పున రవాణా, ఇతర ఛార్జీలు వసూలు చేస్తున్నారు. – నర్సీపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే



బారులుదీరిన ట్రాక్టర్లు

అల్పపీడనంపై కంట్రోల్ రూం ఏర్పాటు

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అల్పపీడనంపై జిల్లా యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేసి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈనెల 23 నుంచి 26 వరకు తుపాను కారణంగా భారీ వర్షాలు కురుస్తాయన్నారు. కలెక్టర్ కార్యాలయంలో 08924-226599, 222888 నంబర్లు అందుబాటులో ఉంటాయన్నారు. అధికారులు, సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, సీహెచ్‌డబ్ల్యూలతో సహా ఎవరూ ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదన్నారు.

★ సముద్రం కల్లోలంగా ఉంటుందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో మత్స్యకారులు ఎవరూ వేటకు వెళ్లకూడదని జిల్లా మత్స్యశాఖ అధికారి వి.ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వేట పరికరాలు, బోట్లు సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు.

రైతన్నలూ.. జాగ్రత్తలు తీసుకోండి: ఏడీఆర్

అనకాపల్లి: రాబోయే అయిదు రోజులు జిల్లాలో వర్షాలు పడే అవకాశం ఉందని రైతన్నలు జాగ్రత్తలు తీసుకోవాలని పరిశోధన కేంద్రం ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు ఒక ప్రకటనలో తెలిపారు. వరి, చెరకు, కంది పంటలకు ఎరువులు వేయడం, క్రిమిసంహారక మందులు పిచికారీ చేయరాదన్నారు. పెసర, మినుము కోతలు వాయిదా వేసుకోవాలని చెప్పారు.

అర్జీదారులతో నేరుగా మాట్లాడాలి



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, డీఆర్వో దయానిధి

కలెక్టరేట్, న్యూస్‌టుడే: అర్జీదారులతో అధికారులు నేరుగా మాట్లాడాలని కలెక్టర్ విజయకృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థకు ఉత్సాహంగా అర్జీదారులు తరలివచ్చారు. వీసీ హాల్‌లో కలెక్టర్, జేసీ జాహ్నవి, ప్రత్యేక ఉపకలెక్టర్ సుబ్బలక్ష్మీ, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, గృహనిర్మాణ పీడీ శ్రీనివాస్ అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అర్జీలు రీఓపెన్ కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సంతృప్తికరమైన సమాధానం ఇవ్వాలన్నారు. సమస్య పరిష్కారం కాకపోతే కారణాలను వివరించాలన్నారు. వ్యక్తిగత, సామాజిక అంశాలపై 206 అర్జీలు వచ్చాయి. వీటిలో రెవెన్యూకు సంబంధించి 126, పంచాయతీ రాజ్‌శాఖ- 19, పోలీసు, మున్సిపల్- 10 ఉన్నాయి. అర్జీలన్నీ శాఖల వారీగా విభజించి సంబంధిత అధికారులకు పంపించారు.

● వాలంటీర్ వ్యవస్థను కొనసాగించాలని అఖిల భారత యువజన సమాఖ్య ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. వాలంటీర్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షులు రాజాన దొరబాబు మాట్లాడుతూ నాలుగు నెలల వేతన బకాయిలు విడుదల చేయాలన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలు అన్నీ నెరవేర్చాలన్నారు. అధికారంలోకి రాగానే వాలంటీర్లకు రూ. 10 వేల గౌరవ వేతనం ఇస్తామని చెప్పి అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు విశేషమైన సేవలు అందించారన్నారు. రాజకీయ ఒత్తిడి కారణంగా రాజీనామా చేసిన వాలంటీర్లను తక్షణమే కొనసాగించాలన్నారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. వాలంటీర్లు, సభ్యులు పాల్గొన్నారు.

నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్

కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లాలో నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిందని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. సోమవారం తన ఛాంబర్‌లో విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఒక మేజర్, మూడు మీడియం, ఒక మైనర్ నీటి ప్రాజెక్టులు ఉన్నాయన్నారు. ఈ ప్రాజెక్టుల పరిధిలో 1,24,843 హెక్టార్ల ఆయకట్టు ఉందన్నారు. 40 రోజుల్లో ఎన్నికల నిర్వహణ పూర్తి చేస్తామన్నారు. అక్టోబరు 21 నుంచి నవంబరు 29 వరకు వివిధ దశల్లో ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. జిల్లాలో పెద్దేరు ప్రాజెక్టుకు సంబంధించి కొత్తగా ఓటరు జాబితా సిద్ధం చేస్తామన్నారు. నాలుగు ప్రాజెక్టు కమిటీలు, 3 జిల్లా కమిటీలు, 303 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయన్నారు. నేటి నుంచి ఓటరు జాబితా శుద్ధీకరణ చేస్తామన్నారు. ఈ ప్రాజెక్టుల పరిధిలో ఆయకట్టు కింద ఉన్న రైతులు అందరూ ఓటరుగా అర్హులన్నారు. అడంగల్‌లో పేరు ఉన్న ప్రతి రైతు నీటి సంఘాల ఎన్నికల్లో పాల్గొనవచ్చన్నారు. ఎన్నికల నిర్వహణకు ఇతర శాఖల నుంచి 668 గెజిట్ అధికారులను పోలింగ్ అధికారులుగా.. 1,530 మందిని పోలింగ్ సిబ్బందిగా నియమిస్తామన్నారు. ఈఈ ఎం.త్రినాథ్, డీఈ రాజేంద్రకుమార్ పాల్గొన్నారు.


బాధితులకు సత్వర న్యాయం



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు వచ్చే చట్టపరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామని ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. జిల్లా కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థకు 32 ఫిర్యాదులు అందాయి. ఫిర్యాదుదారులతో ఆయన మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, ఆస్తి తగాదాలు, ఛీటింగ్ కేసులు అధికంగా వచ్చాయి. చట్ట పరిధిలోని సమస్యలను విచారణ జరిపి బాధితులకు సత్వర న్యాయం చేయాలని ఆదేశాలు జారీచేశారు. జిల్లా అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు ఎంపిక



సుందర రామారెడ్డి

చోడవరం, న్యూస్‌టుడే: దిల్లీలో ఈ ఏడాది డిసెంబరులో జరగనున్న జాతీయ స్థాయి రైఫిల్ షూటింగ్ పోటీలకు చోడవరం పట్టణానికి చెందిన నల్లమిల్లి శ్రీసుందర రామారెడ్డి ఎంపికయ్యాడు. రాజమహేంద్రవరంలో ఈ నెల 20న జరిగిన 68వ రాష్ట్ర స్థాయి షూటింగ్ పోటీల్లో 187 పాయింట్లు స్కోర్ చేసి రజత పతకం సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించాడు.

ఆట్యాపాట్యా జాతీయ పోటీలకు..

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ఆట్యాపాట్యా జూనియర్ల విభాగంలో ముగ్గురు విద్యార్థులు జాతీయ పోటీలకు ఎంపికయ్యారు. కర్నూలులో ఈ నెల 13, 14 తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యాంజలి పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థులు బి.లిఖిత్, కె.మోదమనోజ్ఞ, ఎస్.లక్ష్మి మౌనిక అండర్- 14 విభాగంలో పాల్గొని సత్తా చాటారు. కేరళలో నవంబరు 8, 9, 10 తేదీల్లో జరగనున్న జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నారని కోచ్ అప్పారావు చెప్పారు.



బి.లిఖిత్



కె. మోద మనోజ్ఞ



ఎస్.లక్ష్మి మౌనిక

ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

విశాఖపట్నం: ఐటీఐల్లో మిగులు సీట్ల భర్తీకి ఐదో విడత ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌కు ఈ నెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ శ్రీకాంత్ తెలిపారు. ఇప్పటికే నాలుగు విడతల్లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో దాదాపు అన్ని సీట్లు ప్రభుత్వ ఐటీఐల్లో భర్తీ అయ్యాయన్నారు. ఈ నెల 28న ప్రభుత్వ ఐటీఐలకు, 30న ప్రైవేటు ఐటీఐలకు కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. అభ్యర్థులు ఎక్కడ దరఖాస్తు చేశారో అక్కడే కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు.

ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్‌నకు..

కొత్తూరు (అనకాపల్లి): ఆర్టీసీలో అప్రెంటిస్‌షిప్ చేయడానికి సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 31 లోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని జిల్లా ప్రజా రవాణా అధికారి కె.పద్మావతి ఒక ప్రకటనలో కోరారు. జిల్లాల వారీగా ఏ ట్రేడ్‌లో ఖాళీలు ఉన్నాయో తెలుసుకొని అంతర్జాలం ద్వారా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. అనకాపల్లి జిల్లాలో డీజిల్, మోటార్ మెకానిక్ ట్రేడ్లలో ఐటీఐ చేసిన వారికి అప్రెంటిస్‌షిప్‌లను కేటాయించామన్నారు. అన్ని ధ్రువపత్రాలతో దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుందన్నారు. దరఖాస్తుదారులు వివరాలకు ఆర్టీసీ కార్యాలయాలు, 08922 294906 నంబరులో సంప్రదించాలని కోరారు.

28న అగ్రిగోల్డ్ బాధితుల విజ్ఞాపన సదస్సు

కొత్తూరు (అనకాపల్లి): అగ్రిగోల్డ్ బాధితులకు పదేళ్లు దాటినా మోక్షం కలగలేదని సంఘ జిల్లా గౌరవాధ్యక్షుడు వై.ఎన్.భద్రం ఆవేదన వ్యక్తం చేశారు. సీపీఐ భవనంలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 28 న విజయవాడలో బాధితులతో విజ్ఞాపన సదస్సు నిర్వహించనున్నట్లు చెప్పారు. సంఘ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మాణిక్యాలరావు, రమణ, దుర్గారావు, శేషు, లక్ష్మణ, సూరిబాబు, చిన అప్పారావు, అప్పారావు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మైదానంలోనూ డ్రాగన్ సాగు





కె.కోటపాడు, న్యూస్‌టుడే: పాడేరు మన్యానికే పరిమితమైన డ్రాగన్ ఫ్రూట్ సాగు మైదానంలో మంచి దిగుబడులిస్తోంది. కె.కోటపాడు మండలం ఎ.కోడూరుకు చెందిన రైతు **లెక్కల కోటేశ్వరరావు** 3.5 ఎకరాల్లో డ్రాగన్ పండిస్తున్నారు. రెండేళ్ల కిందట పూర్తిగా సేంద్రియ విధానంలో సాగు చేస్తూ బిందు సేద్యం ద్వారా నీరందిస్తున్నారు. మొదటి ఏడాది మూడు టన్నులు, రెండో ఏడాదిలో ఇప్పటివరకు ఐదు టన్నుల దిగుబడి వచ్చిందని రైతు వెల్లడించారు.

● తోట వద్దే కేజీ రూ. 150 చొప్పున విక్రయిస్తున్నారు. రెండేళ్లలో ఖర్చులన్నీ పోను రూ. 4 లక్షల ఆదాయం వచ్చిందని రైతు కోటేశ్వరరావు పేర్కొన్నారు. న్యూస్‌టుడే, చింతపల్లి

పెరిగిన రంగు, మధ్య రకం బెల్లం ధరలు

అనకాపల్లి మార్కెట్‌లో గత వారం రోజులుగా రంగు, మధ్య రకం బెల్లం ధరలు పెరిగాయి. నాసి రకం ధరలు యథావిధిగా ఉన్నాయి. రంగులు వంద కేజీలకు రూ. 355, మధ్య రకాలు రూ. 190 పెరిగాయి. నాసి రకం ధరల్లో ఎటువంటి మార్పు లేదు. – న్యూస్‌టుడే, అనకాపల్లి

రకం	గత వారం	ఈ వారం
రంగులు	4,640	4,995
మధ్య	3,905	4,095
నాసి	3,375	3,375

బేబీ పల్పింగ్ యంత్రంతో..

గంటకు 250 కేజీల కాఫీ పప్పు

రైతులకు తగ్గిన శ్రమ, సమయం ఆదా



వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన అల్లూరి సీతారామ రాజు జిల్లాలో గిరిజన రైతులు వ్యవసాయ రంగంలో యంత్రాల వినియోగాన్ని అందిపుచ్చుకుంటున్నారు.

జిల్లాలో సుమారు 1.5 లక్షల ఎకరాల్లో కాఫీ సాగవుతోంది. లక్షకు పైగా కుటుంబాలు కాఫీని వాణిజ్య పంటగా పండిస్తున్నాయి. కేంద్ర కాఫీ బోర్డు నాణ్యమైన కాఫీ పప్పు (పార్చిమెంట్) తయారీ కోసం బేబీ పల్పింగ్ యంత్రాలను రూపొందించింది. ఈ యంత్రాన్ని చేతితో తిప్పడం ద్వారా కాఫీ పండ్ల నుంచి తొక్క, ఇతర వ్యర్థాలు వేరుపడి పార్చిమెంట్ వస్తుంది. ఇది శ్రమతో కూడుకున్నది కావడం, ఎక్కువ సమయం పడుతుండటంతో రైతులు ఈ యంత్రాలను వినియోగించడం లేదు. వాసన్ సంస్థ ఇంజినీరింగ్ నిపుణులతో బేబీ పల్పింగ్ యంత్రంలో కొన్ని మార్పులు



చేయించింది. విద్యుత్తుతో పనిచేసేలా 0.5 హెచ్‌పీ మోటారును అనుసంధానం చేయడంతో గంటకు 250 కేజీల కాఫీ పండ్లను పప్పు చేయవచ్చు. తద్వారా మానవ శ్రమ, సమయం ఆదా అవుతుంది. కేంద్ర కాఫీ బోర్డు ఈ ఏడాది గిరిజన రైతులకు రాయితీపై 140 బేబీ పల్పింగ్ యంత్రాలను పంపిణీ చేయగా.. వీటిలో విద్యుత్తుతో పనిచేసేవి 80 వరకు ఉన్నాయి.

85 శాతం రాయితీ

'ఒక్కో యంత్రం విలువ రూ. 58 వేల నుంచి రూ. 80 వేల వరకు ఉంది. ఇందులో కాఫీ బోర్డు 50 శాతం, ఆంధ్రప్రదేశ్ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ (ఏపీఎఫ్‌పీఎస్) 35 శాతం రాయితీ ఇస్తున్నాయి. లబ్ధిదారులు 15 శాతం భరించేందుకు ముందుకు వస్తే ఆ మొత్తాన్ని బ్యాంకు రుణంగా మంజూరు చేయిస్తాం. ఈ ఏడాది 600 మంది రైతులు ఈ యంత్రాలు కావాలని దరఖాస్తు చేశారని కాఫీ బోర్డు విస్తరణ విభాగం డీడీ రమేష్ పేర్కొన్నారు.

రైతేరాజు


చిరుధాన్యాలతో బిస్కెట్ల తయారీ

? బిస్కెట్ల తయారీకి చిరుధాన్యాలను వినియోగించవచ్చా.
– **భీశెట్టి అభిషేక్, మునగపాక**

✔ చోడి, కొర్ర, సామ, ఊద, సజ్జ, వరిగలతో బిస్కెట్లు తయారు చేయవచ్చు. చిరుధాన్యాల పిండితోపాటు గోధుమ పిండి, పంచదార, కొద్దిగా యాలకులు, పాలు, బేకింగ్ పౌడరు వాడాల్సి ఉంటుంది. పరిశోధన కేంద్రానికి వస్తే తయారీ విధానాన్ని వివరిస్తాం.

? వరి పొట్టదశలో ఉంది. ఆకులు తెల్లబడుతున్నాయి. చూస్తే గొంగళి పురుగులు కనిపిస్తున్నాయి. నివారణకు ఏం చేయాలి. – **దాట్ల రామరాజు, ఎస్.రాయవరం**

✔ పంట పిలక దశలో ఉంటే తాడుతో పొలానికి అడ్డంగా రెండు, మూడుసార్లు లాగితే పురుగులు కింద పడిపోతాయి. పొట్ట దశలో ఉంటే నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ. / ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.



రైతుల ప్రశ్నలు, సందేహాలకు అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కేంద్రం **ఏడీఆర్ డాక్టర్ సీహెచ్ ముకుందరావు** సమాధానాలు ఇచ్చారు. – న్యూస్‌టుడే, అనకాపల్లి

సాగులో సందేహాలా ఫోను చేయండి: పాడేరు ఏరువాక కేంద్రం విస్తరణ విభాగం శాస్త్రవేత్త **డాక్టర్ ప్రదీప్‌కుమార్** సమాధానాలు ఇస్తారు. మంగళవారం ఉ: 9 నుంచి - సాయంత్రం 5 గంటల మధ్య **95505 06498** నంబరుకు ఫోన్ చేయవచ్చు.

వరిలో తెగుళ్ల ముప్పు



నీట మునిగిన వరి పంట

నక్కపల్లి, న్యూస్‌టుడే: అల్పపీడన ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పంటలు నీట మునిగాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లో వరిని తెగుళ్లు ఆశించాయి. ముందస్తు చర్యలతో వీటిని సమర్థంగా నియంత్రించవచ్చని పాయకరావుపేట సబ్ డివిజన్ ఏడీఏ ఉమాప్రసాద్ సూచిస్తున్నారు.

ఆకుముడత: ఆకులు నిలువుగా ముడుచుకుని ఉంటాయి. వీటిని విడదీస్తే లేత పసుపు/ ఆకుపచ్చ గొంగళి పురుగులుంటాయి. గుంపులుగా ఎగిరే రెక్కల పురుగులు కనిపించినా తెగులుకు సూచికగా గుర్తించాలి. నియంత్రణలో భాగంగా ఎకరాకు 15-20 చోట్ల పక్షి స్థావరాలు ఏర్పాటు చేస్తే ఫలితం ఉంటుంది. తెగులు ఉద్ధృతి కనిపిస్తే పైరు మీదుగా తాడుతో లాగితే చివర్లలో ఉన్న పురుగులు రాలి కిందపడతాయి. తర్వాత పొలంలో నీటిని బయటకు తీసేయాలి. తొలి దశలో రెండు గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. 50 గ్రాముల ఫ్లూబెండమైడ్ మందును లీటరు నీటికి కలిపి ఎకరాకు సరిపడా చల్లుకోవాలి. ఈ మందు వినియోగిస్తే కాండం తొలిచే పురుగు నియంత్రణలో ఉంటుంది.



పాముపొడ: దీన్నే పాచి తెగులు అంటారు. ఆకుపై మచ్చలు వచ్చి కాలినట్లు ఉంటుంది. 2 ఎం.ఎల్. హెక్సాకొనజోల్/ 1 ఎం.ఎల్. ప్రొపికోనజోల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

అగ్గి తెగులు: ఆకుల మధ్య ఎండిపోయినట్లు ఉంటుంది. దీన్ని గమనిస్తే యూరియా వాడకం తగ్గించాలి. 0.6 గ్రాముల ట్రైసైక్లోజోల్ ఎకరాకు 120 గ్రాములు చొప్పున చల్లితే తెగులు నియంత్రణలో ఉంటుంది.

సముద్రంలో మత్స్యకారుడి గల్లంతు

అంతర్వేది, న్యూస్‌టుడే: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంతర్వేదిపల్లి పాలెం వద్ద సముద్రంలో చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు బొండు నూకరాజు(55) ప్రమాదవశాత్తు సముద్రంలో గల్లంతయ్యాడు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం రాజానగరం గ్రామానికి చెందిన ఇతను చాలాకాలంగా చేపల వేట నిమిత్తం పల్లిపాలెం వస్తుండేవాడు. సోమవారం రోజూ మాదిరిగానే మరో నలుగురు మత్స్యకారులతో కలిసి సముద్రంలోకి వెళ్లాడు. ఈ సందర్భంగా పడవపై నుంచి ప్రమాదవశాత్తు జారి కెరటాల్లో కొట్టుకుపోయాడు. ఎంత వెతికినా జాడ కనిపించలేదు. దీంతో నూకరాజు సముద్రంలో గల్లంతైనట్లు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎమ్మెల్సీ వ్యాఖ్యలపై తెలుగు మహిళల నిరసన



ఎన్టీఆర్ విగ్రహం ముందు నిరసన తెలుపుతున్న తెలుగు మహిళలు

అనకాపల్లి, న్యూస్‌టుడే: వైకాపా ఎమ్మెల్సీ వరదు కల్యాణి స్థాయి మరచి మాట్లాడుతున్నారని తెలుగు మహిళలు ఆరోపించారు. స్థానిక రింగ్‌రోడ్డులోని తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఎన్టీఆర్ విగ్రహం ముందు కల్యాణికి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కొణతాల రత్నకుమారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌లను విమర్శించే స్థాయి ఆమెకు లేదన్నారు. గత ప్రభుత్వంలో మహిళలు, దళితులపై ఎన్నో దాడులు, అక్రత్యాలు చేసినా ఒక్కరిపైనా చర్యలు తీసుకోలేదన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలపై ఎటువంటి సంఘటనలు జరిగినా పార్టీలకు అతీతంగా చర్యలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. దిశ చట్టం ద్వారా ఎంత మందికి శిక్షలు విధించారో చెప్పాలన్నారు. సొంత తల్లి, చెల్లికి న్యాయం చేయలేని జగన్ మిగిలిన మహిళలకు ఏమి చేయగలరని ప్రశ్నించారు. ఎన్నికలలో ప్రజలు బుద్ధి చెప్పినా కొందరి వైకాపా నాయకులలో మార్పు రాలేదన్నారు.

రోడ్డు ప్రమాదంలో బాలుడి దుర్మరణం



జిలానీ మృతదేహం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: అమ్మమ్మ ఇంటికి పండగకు వచ్చిన బాలుడిని రోడ్డు ప్రమాదం బలితీసుకుంది. దీనికి సంబంధించి ఎస్.రాయవరం హెడ్ కానిస్టేబుల్ పవన్ కథనం ప్రకారం.. కాకినాడకు చెందిన షేక్ మహ్మమద్ యాసిన్ తన భార్య, కుమారుడు అబ్దుల్ ఖాదర్ జిలానీ (16)తో నక్కపల్లి మండలం పెదబోదిగల్లంలోని అత్తవారింటికి వచ్చారు. సోమవారం జిలానీ తన తాత షేక్ మహమ్మద్ ఖాదర్ బాషాతో కలిసి స్కూటీపై అడ్డురోడ్డు వచ్చి, తిరిగి వెళ్తుండగా అనకాపల్లి నుంచి తుని వైపు వెళ్తున్న లారీ వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిపోయిన జిలానీ తలకు తీవ్రగాయం కాగా, ఎడమ కాలు, చేయి విరిగిపోయాయి. వెంటనే నక్కపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి, ప్రథమ చికిత్స అనంతరం అనకాపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. దీనిపై బాలుడి తాత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

జిల్లా అభివృద్ధిపై 25న సమీక్ష

విశాఖపట్నం, న్యూస్‌టుడే: విశాఖ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి ఈనెల 25న జిల్లా పర్యటనకు రానున్నారు. ఆరోజు మధ్యాహ్నం కలెక్టరేట్ సమావేశమందిరంలో జిల్లా అభివృద్ధిపై మంత్రి సమీక్ష నిర్వహిస్తారని కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. జిల్లాలో చేపట్టిన ప్రాజెక్టులు, అమలవుతున్న సంక్షేమ పథకాలు, పరిపాలనా పరమైన అంశాలపై చర్చిస్తారన్నారు. అన్ని విభాగాల అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి వివరాలతో నివేదికలు సిద్ధం చేసుకోవాలన్నారు. అదేరోజు ఉదయం ఆనందపురం మండలం సి-కన్వెన్షన్ హాలులో భీమిలి నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్ష జరుగుతుందన్నారు.

24న జడ్పీ సాధారణ సమావేశం

జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈనెల 24న జడ్పీ సాధారణ సమావేశం నిర్వహించనున్నట్లు కలెక్టర్ హరేంధిరప్రసాద్ తెలిపారు. సమావేశ అజెండాకు అనుగుణంగా గత సమావేశంలో చర్చించిన అంశాలు, తీసుకున్న చర్యలతో నివేదికలు సిద్ధం చేసుకుని రావాలని అధికారులకు సూచించారు.

అదుపుతప్పి గెడ్డలో కారు బోల్తా



దెబ్బతిన్న వంతెన రెయిలింగ్



గెడ్డలో పడిన కారు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి పెదబొడ్డేపల్లి పెద్దమదుం రెయిలింగ్‌ను ఢీకొట్టి గెడ్డలో పల్టీ కొట్టింది. ఆదివారం రాత్రి 11.30 గంటల సమయంలో ఈ ప్రమాదం జరిగింది. పట్టణంలోని బొంబాయి బజారు యజమాని బి.కొండలరావు గాయపడ్డారు. ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించారు.

ఉరకగెడ్డ బాధితులకు పరిహారం చెల్లించాలి



గిరిజనులతో కలిసి ప్రాజెక్టును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: శంకరం పంచాయతీ పరిధిలోని ఉరకగెడ్డ ప్రాజెక్టు నిర్వాసితులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న, మండల కార్యదర్శి నరసింహమూర్తి, భవాని డిమాండ్ చేశారు. స్థానికులతో కలిసి ఉరకగెడ్డ ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. జలాశయ నిర్మాణ సమయంలో బొడ్డరేవు, చినబొడ్డరేవు గ్రామాలకు చెందిన 56 గిరిజన కుటుంబాలు నిర్వాసితులుగా మారాయన్నారు. ఆర్‌ఆర్ ప్యాకేజీ కింద పరిహారం ఇవ్వాలని 2005లో జీవో నంబరు 68 విడుదలైనా ఇప్పటికీ అమలు కాలేదన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	120	115
లైవ్	142	135
డ్రెస్డ్	206	240
స్కిన్‌లెస్	234	250

అనకాపల్లి
• అనకాపల్లి • ఎలమంచిలి • పాయకరావుపేట

తెరపై ఈనాడు

అనకాపల్లి: రాజా : **దేవర,** రామచంద్ర: **మార్టిన్** ఉదయం, రెండోఆట, **రివైండ్** మేట్నీ. మొదటిఆట, శ్రీ సత్య: **మా నాన్న,** సత్యనారాయణ స్క్రీన్1: **విశ్వం,** స్క్రీన్2: **లవ్‌రెడ్డి,** వెంకటేశ్వర: **వీక్షణం,** పర్తిసాయి: **వేట్టయన్ ద హంటర్,** షిర్డిసాయి: **వేట్టయన్ ద హంటర్**
అచ్యుతాపురం: శ్రీబాలాజీ విలేజ్ సినిమా స్క్రీన్-1: **వేట్టయన్, విశ్వం** స్క్రీన్-2: **దేవర**

పాడి రైతుల నిరసన

మునగపాక, న్యూస్‌టుడే: విశాఖ డెయిరీ తగ్గించిన పాలధరను పెంచాలని అరబుపాలెం పాడి రైతులు సోమవారం పాలసేకరణ కేంద్రం వద్ద పాలక్యాన్లతో నిరసన చేపట్టారు. సీఐటీయూ మండల కార్యదర్శి శొంఠ్యాన బ్రహ్మాజీ మాట్లాడుతూ దాణాధర భారీగా పెంచి, పాలధర తగ్గించారన్నారు. రైతులు పొలమరశెట్టి నాగేశ్వరరావు, కోరిబిల్లి చినరాయుడు, యల్లపు సూరిబాబు, మళ్ల నాగేశ్వరరావు, బొడ్డేడ సంతోష్ పాల్గొన్నారు.

ప్రజల రక్షణకు పోలీసులు

కోటవురట్ల, న్యూస్‌టుడే: కోటవురట్ల పోలీస్ స్టేషన్లో పోలీసుల అమరవీరుల దినోత్సవాన్ని సోమవారం నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల ఆత్మకు శాంతి కలగాలని, ఎస్సై రమేష్, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు కొద్ది సేపు మౌనం పాటించారు. పోలీస్ స్టేషన్ నుంచి కోటవురట్ల ప్రధాన కూడలి వరకు ర్యాలీగా వెళ్లి, అక్కడ మానవహారంగా ఏర్పడ్డారు. ప్రజల రక్షణ కోసం పోలీసులు అందిస్తున్న సేవలను ఎస్సై వివరించారు.


కోటవురట్ల పోలీస్‌స్టేషన్ ఎదుట మౌనం పాటిస్తున్న పోలీసులు, విద్యార్థులు

అ వీ ఇ వీ

దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

లక్ష్మీదేవి పేట(అనకాపల్లి), న్యూస్‌టుడే: పట్టణంలోని ఉడ్‌పేటలోని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమ సంఘం వద్ద సోమవారం జిల్లా దివ్యాంగుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జగదీశ్ సహకారంతో సమకూర్చిన 10 ట్రైసైకిళ్లను సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు పాత్రుపల్లి వీరుయాదవ్ అర్హులైన దివ్యాంగులకు అందజేశారు. పలువురు సంక్షేమ సంఘం సభ్యులు పాల్గొన్నారు.


పంపిణీ చేసిన ట్రైసైకిళ్లతో దివ్యాంగులు

జీవీఎంసీలో గందరగోళం

ఇద్దరు అధికారుల బదిలీ



అనకాపల్లి, న్యూస్‌టుడే
జీవీఎంసీ అనకాపల్లి జోన్‌లో మరోసారి గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ నుంచి ఇద్దరు అధికారులను సోమవారం బదిలీ చేశారు. ఇక్కడ జోనల్ కమిషనర్‌గా ఉన్న అయ్యప్పనాయుడును ఈనెల 4న ఇక్కడ నుంచి రామచంద్రపురం బదిలీ చేయగా ఎవరికీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదు. దీనిపై 'ఈనాడు'లో కథనం రావడంతో ఈఈ చిరంజీవరావుకు ఈ బాధ్యతలను ఈనెల 15న అప్పగించారు. వారం కూడా గడవక ముందే ఆయనను సోమవారం ఇక్కడ నుంచి వేపగుంట జోన్‌కు బదిలీ చేశారు. ఆయన స్థానంలో సూరిశెట్టి శేఖర్‌ను నియమించారు. ఆయనకు జోనల్ కమిషనర్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించలేదు. శేఖర్ ప్రస్తుతం అనకాపల్లితోపాటు మరో రెండు జోన్లకు తాగునీటి సరఫరా కార్యనిర్వాహక ఇంజినీర్‌గా ఉన్నారు. ఇప్పుడు పూర్తిగా అనకాపల్లి జోన్ ఈఈగా నియమించారు. అదే విధంగా నగర సామాజిక అభివృద్ధి సంస్థ అసిస్టెంట్ ప్రాజెక్టు డైరెక్టర్ వి.కె.దొరను భీమిలి బదిలీ చేశారు. ఈయన స్థానంలో అక్కడ పనిచేస్తున్న ఏపీడీ యల్లపు సంతోష్‌కుమార్‌ను ఇక్కడ నియమించారు.
▮ జోనల్ కమిషనర్ లేకపోవడంతో సోమవారం నిర్వహించాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను చేపట్టలేదు. వివిధ సమస్యలపై వినతిపత్రాలు ఇవ్వడానికి వచ్చిన వారు వెనుతిరిగారు. నెల రోజులుగా జనన, మరణ ధ్రువపత్రాల జారీ నిలిచిపోయింది. ఈనెల 22న ఉద్యోగుల జీతాల బిల్లుల తయారీ చేసి ప్రధాన కార్యాలయానికి పంపాల్సి ఉంటుంది. లేకపోతే ఒకటో తేదీన జీతాలు చెల్లించడం కష్టమే. అనకాపల్లి జోన్‌లో అన్ని విభాగాలు కలిపి 380 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరికి జీతాల చెల్లింపు ప్రశ్నార్థకంగా మారింది.

ఇంటర్‌నెట్ వినియోగంలో జాగ్రత్తలు ముఖ్యం

'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో నారాయణ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: ఇంటర్‌నెట్ వినియోగంలో జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యమని నారాయణ పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాలీషా, రాజా అన్నారు. 'ఈనాడు' ఆధ్వర్యంలో నారాయణ ఈటెక్నో, ఒలింపియాడ్ పాఠశాల విద్యార్థులకు 'ఇంటర్‌నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై సోమవారం వ్యాసరచన పోటీలు జరిగాయి. విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ ఇంటర్‌నెట్ వినియోగం బాగా పెరిగిందని, దీన్ని వల్ల లాభాలు ఎన్ని ఉన్నాయో సక్రమంగా వినియోగించుకుంటే నష్టాలూ అన్నే ఉన్నాయన్నారు. విద్యార్థులు నెట్‌ను ఎలా వినియోగించాలి అన్న దానిపై పాఠశాలల్లో ఉపాధ్యాయులు అవగాహన కల్పించడంతో పాటు తల్లిదండ్రుల పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన ఎనిమిదో తరగతి విద్యార్థిని యు.దీక్షిత, పదో తరగతి- వి.సాయి సమర్థ, తొమ్మిదో తరగతి- వి.స్నేహకు బహుమతులు అందజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు డి.భూషణ్, డి.తేజ, పరమేశ్, గీత పాల్గొన్నారు.


పరీక్ష రాయడానికి వస్తున్న విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కాలీషా, రాజా

తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోలు రూంలు

అనకాపల్లి పట్టణం, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేపథ్యంలో అనకాపల్లి, ఎస్.రాయవరం తహసీల్దార్ కార్యాలయాల్లో కంట్రోలు ఏర్పాటు చేసినట్లు తహసీల్దార్లు విజయ్‌కుమార్, రమేశ్‌బాబు తెలిపారు. ఈనెల 22, 23, 24 తేదీల్లో 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటారు. చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. సహాయక చర్యలకు 89859 96839, 90323 14998కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

సక్రమంగా పోషకాహారం అందించాలి

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: అంగన్వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు సక్రమంగా పోషకాహారం అందించాలని 84వ వార్డు తెదేపా ఇన్‌ఛార్జ్ మాదంశెట్టి నీలబాబు పేర్కొన్నారు. కొత్తూరు నరసింగరావుపేటలో అంగన్వాడీ కేంద్రం, స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం కూటమి నాయకులతో కలిసి తనిఖీ చేశారు. చిన్నారులకు క్రమం తప్పకుండా పోషకాహారం అందించాలన్నారు. పీహెచ్‌సీలో రోగులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

నిరక్షరాస్యులపై దృష్టి పెట్టాలి

నక్కపల్లి, న్యూస్‌టుడే: పొదుపు సంఘాల్లో అందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని ఎంపీడీఓ డి.సీతారామరాజు సూచించారు. నక్కపల్లి వెలుగు కార్యాలయంలో సోమవారం ఏపీఎం శ్రీనివాసరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సీసీలు రాజు, అప్పారావు, కోటి, సన్యాసిరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: పెనుగొల్లు గ్రామానికి మంగళవారం ఉదయం 8 నుంచి 2 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈఈ రాజశేఖర్ ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు తమకు సహకరించాలని ఆయన కోరారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

ఎస్.రాయవరం, నక్కపల్లి, న్యూస్‌టుడే: పలు పాఠశాలల్లో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పీఆర్టీయూ ఆధ్వర్యంలో వింగ్స్ ఫౌండేషన్ ఎన్ఎంఎంఎస్ పరీక్ష పుస్తకాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ డైరెక్టర్ జయప్రకాష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉన్నతంగా చదువుకుని సమాజానికి ఆదర్శంగా నిలవాలని కోరారు. పెదబోదిగల్లం విద్యార్థులకు ఫౌండేషన్ ప్రతినిధులు ఎర్రమిల్లి వెంకటజయరాం, జయప్రకాశ్ హెచ్.ఎం. సత్యనారాయణతో కలిసి పుస్తకాలు అందించారు.

పల్లెల్లో సంచార ఆధార్ నమోదు నేటి నుంచి

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: పల్లెల్లో ఆధార్ నమోదుకు అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సచివాలయ ఉద్యోగుల ఆధ్వర్యంలో సంచార ఆధార్ నమోదును నిర్వహించడానికి యంత్రాంగం చర్యలు తీసుకుంది. ఆధార్ నమోదుకు అవసరమైన పరికరాలను సచివాలయ ఉద్యోగులకు ఇప్పటికే అధికారులు అందించారు. ఎంపిక చేసిన సచివాలయాల్లో ఈ కార్యక్రమాన్ని ఈనెల 22 నుంచి ప్రారంభిస్తారు. జిల్లా వ్యాప్తంగా 163 సచివాలయాల పరిధిలో డిజిటల్ సహాయకులు వీటి నమోదు పనులను చేపడుతున్నారు. ఇప్పటివరకు ఆధార్‌కార్డు తీసుకోని వారు, కొత్తగా నమోదు చేయించుకోవాలనుకునే వారు ఈసంచార కేంద్రాలకు వెళ్తే ఆధార్ సంఖ్యను అందిస్తారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే 60 ఏళ్ల దాటిన పింఛన్లు పొందలేకపోయే వారు, ఇతర పథకాలు పొందలేకపోతున్న వారికి ప్రయోజనం కలగనుంది. ఈకార్యక్రమాన్ని నిరంతర పర్యవేక్షణ చేయాలని ఎంపీడీఓలకు కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు. మొదటి దశలో అనకాపల్లి జిల్లాలో 163 సచివాలయాల్లో ఈనెల 25 నాటికి నమోదు కార్యక్రమాన్ని పూర్తిచేయాలి.


ఆధార్ నమోదు చేస్తున్న డిజిటల్ సహాయకురాలు (పాతచిత్రం)

సమస్యలపై అధికారుల నిలదీత


అధికారుల ప్రశ్నిస్తున్న సభ్యులు

అనకాపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: పట్టణంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం వాడివేడిగా సాగింది. ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభించారు. గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నప్పుడు సర్పంచులకు, ఎంపీటీసీ సభ్యులకు కనీస సమాచారం ఇవ్వడం లేదని బవులవాడ, తుమ్మపాల ఎంపీటీసీ సభ్యులు విజయ్, చదరం నాగేశ్వరరావు అధికారులపై విరుచుకుపడ్డారు. ప్రభుత్వం మారినా ఇంకా అధికారులు వైకాపా అనుచరులుగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. తుమ్మపాల ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో కేవలం వైకాపా ఎంపీటీసీ సభ్యులకు మాత్రమే సమాచారం ఇవ్వడంపై చదరం నాగేశ్వరరావు ఆసుపత్రి వైద్యాధికారిని నిలదీశారు. ప్రొటోకాల్ ఎందుకు పాటించడం లేదని అసహనం వ్యక్తం చేశారు. బవులవాడలో మూతపడిన మూడు పాఠశాలలను తక్షణమే తెరిపించాలని డిమాండ్ చేశారు. మూలపేట ఎంపీటీసీ సభ్యులు అలివేలు, పంచదార్ల కన్నారావు, నారపిన్ని చంద్రశేఖర్, వెంకుపాలెం సర్పంచి రాపేటి నాగేశ్వరరావు వివిధ సమస్యలు ప్రస్తావించారు. జడ్పీ వైస్ ఛైర్‌పర్సన్ సత్యవతి, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో నరసింహారావు, వైస్‌ఎంపీపీ సూర్యకుమారి, అధికారులు పాల్గొన్నారు.

ముంపు బారిన వరి పొలాలు

పాయకరావుపేట, న్యూస్‌టుడే: కడియం చెరువు నీరు కారణంగా వరి పొలాలు ముంపు బారిన పడుతున్నాయని పాల్తేరుకు చెందిన సిద్ధ అయ్యరాజు, ఎ.సత్తిబాబు తదితరులు తహసీల్దారు సత్యనారాయణకు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు దిగువన 60 ఎకరాల వరకు వరి సాగు చేస్తున్నామని చెప్పారు.

వృద్ధుల సంరక్షణ బాధ్యత పిల్లలదే!

కలెక్టరేట్, న్యూస్‌టుడే: వృద్ధులైన తల్లిదండ్రుల పోషణ బాధ్యత వారి పిల్లలే బాధ్యతగా చూసుకోవాలని కలెక్టర్ విజయకృష్ణన్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం-2007 ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ చట్టంపై విస్తృతంగా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. పోషణ పట్ల పిల్లలు నిర్లక్ష్యం వహించినా, వేధింపులు ఎదుర్కొంటున్నా వృద్ధులు రెవెన్యూ డివిజన్ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ చట్టంపై అవగాహనకు గ్రామ సచివాలయాలు, బస్టాండ్లు, ఆసుపత్రులు, బహిరంగ ప్రదేశాల్లో, రెవెన్యూ, పంచాయతీ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సంయుక్త కలెక్టర్ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, ప్రత్యేక ఉపకలెక్టర్ సుబ్బలక్ష్మి, హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జగదీశ్ పాల్గొన్నారు.


గోడప్రతులు ఆవిష్కరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, జేసీ జాహ్నవి, అధికారులు

ఆసుపత్రిలో రక్త పరీక్షలు పునఃప్రారంభం

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం నుంచి రోగులకు అన్ని రకాల రక్త పరీక్షలు నిర్వహించారు. రసాయనాలు అయిపోవడంతో ఇక్కడ గత కొద్ది కాలంగా రోగులకు రక్త పరీక్షలు నిలిచిపోయాయి. 'ఈనాడు'లో ప్రచురించిన కథనానికి స్పందించిన అధికారులు ఆసుపత్రి నిధుల నుంచి రసాయనాలు కొనుగోలు చేశారు. సోమవారం నుంచి ఆసుపత్రిలో అన్ని రకాల పరీక్షలు నిర్వహిస్తున్నామని వైద్యులు నీహారిక, టెక్నీషియన్ నవీన్ చెప్పారు. ఇక నుంచి రోగులు ఎవరూ ప్రైవేటు ల్యాబ్‌లకు వెళ్లాల్సిన పనిలేదన్నారు. సోమవారం ఉదయం నుంచి ఆసుపత్రికి వచ్చిన రోగులకు ఇక్కడ ఉచితంగా పరీక్షలు చేయించుకున్నారన్నారు. వర్షాలు కురవడం వల్ల ఆసుపత్రికి వచ్చే రోగుల సంఖ్య పెరిగిందన్నారు. నీరు కలుషితం కావడం వల్ల ఎక్కువ మంది టైఫాయిడ్ జ్వరాల బారిన పడుతున్నారని వివరించారు.


రక్తపరీక్షలు నిర్వహిస్తున్న టెక్నీషియన్

బంగారమ్మపాలెంలో ఇళ్ల చుట్టూ నీరే!

ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: బంగారమ్మపాలెంలో పలు వీధులు నీటమునిగాయి. ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి రామాలయం వీధి, కింద వీధుల్లో వర్షపునీరు భారీగా చేరింది. ఇక్కడ కనీస అవసరాలకు సైతం ఇంటి బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గత నెలలోనూ ఇక్కడ ఇదే పరిస్థితి ఎదురైనప్పుడు అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టి వదిలేశారు. దీంతో మళ్లీ ఇప్పుడు ఇళ్లన్ని ముంపునకు గురయ్యాయి. అధికారులు శాశ్వత చర్యలు తీసుకోవాలని మత్స్యకారులు కోరుతున్నారు.


ఇళ్ల ముందు నిలిచిన నీరు

వేంకటేశ్వర ఆలయ నిర్మాణానికి విరాళాలు


కమిటీ సభ్యులకు విరాళం అందజేస్తున్న ఆడారి పోలి నాగేశ్వరరావు కుటుంబసభ్యులు

మునగపాక, న్యూస్‌టుడే: మునగపాకలో చేపట్టిన వేంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి ఈ గ్రామానికి చెందిన ఆడారి పోలినాగేశ్వరరావు జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు గంగ మహేష్ రూ. 1,11,111 సోమవారం కమిటీ సభ్యులకు అందజేశారు. ఏవీ సత్యనారాయణ, సరోజని దంపతులు రూ. 25 వేలు, తిమ్మరాజుపేటకు చెందిన కర్రి కృష్ణ రూ. 25 వేలు, మునగపాకకు చెందిన పీలా జగ్గారావు రూ. 10,116, పీలా అప్పారావు, నాగ అప్పారావు, టెక్కలి వెంకటరావు రూ.ఐదువేలు వంతున విరాళాలు అందజేశారు.

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే: అనకాపల్లిలో సత్యసాయి అవతార ప్రకటన దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. సత్యసాయి సేవా మందిరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఉదయం ఓంకారం, సుప్రభాతం, నగర సంకీర్తన, సాయి గాయత్రి పారాయణం, పల్లకీ సేవ నిర్వహించారు. సేవాసమితి కన్వీనర్ కేవీ మహేశ్వరరావు, సభ్యులు పాల్గొన్నారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: కాగిత దుర్గమ్మ ఆలయంలో ఏకాహం భక్తిశ్రద్ధలతో సాగింది. ఆలయ వార్షిక వేడుకల్లో భాగంగా సోమవారం ఉదయం 24 గంటల భజన ఏర్పాటు చేశారు. పలు ప్రాంతాలనుంచి వచ్చిన బృందాల సభ్యులు వచ్చి భక్తిపాటలు పాడారు. వేడుకల్లో భాగంగా మంగళవారం భారీ అన్నదానం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వెల్లడించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రేబాక, తిరుపతిపాలెం, రమణయ్యపేట, గుల్లిపాడు, రామాపురం తదితర గ్రామాల్లో ఆలయ నిర్వాహకులకు ఆర్.ఎస్.ఎస్. ధర్మజాగరణ విభాగం, దాన ధర్మ ట్రస్టు ఆధ్వర్యంలో ధూప, దీప, నైవేద్యాలను పంపిణీ చేశారు. ట్రస్టు ప్రతినిధి ప్రసాద్, వెల్లంకి కాసుబాబు, దొర, విజయ్, కిరణ్ పాల్గొన్నారు.


కాగిత ఆలయంలో భజనలు చేస్తున్న భక్తులు

రీసర్వేలో తప్పులతో ఇబ్బందులు

కోటవురట్ల, న్యూస్‌టుడే: గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన రీసర్వేలో వచ్చిన తప్పులతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని తెదేపా జిల్లా ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు అన్నారు. మండలంలో జల్లూరులో తహసీల్దారు తిరుమలబాబు రీసర్వే గ్రామసభ నిర్వహించారు.

నక్కపల్లి, న్యూస్‌టుడే: మాపేరున భూ రికార్డు లున్నా రీసర్వేలో మరొకరి పేరున మార్చేశారని జి.జగన్నాథపురానికి చెందిన పలువురు రైతులు సోమవారం నిర్వహించిన గ్రామసభలో ఉప తహసీల్దారు అన్నాజీరావుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వివిధ సర్వే నంబర్లలో సుమారు 19 ఎకరాల భూమి రికార్డుల ప్రకారం తమకే ఉందని, వీటిని తామే సాగుచేస్తున్నామన్నారు. గ్రామంలో నిర్వహించిన సభలో మొత్తం 39 వినతులు వచ్చాయన్నారు. సర్వేయరు సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.


జల్లూరులో వినతులు పరిశీలిస్తున్న తహసీల్దారు తిరుమలబాబు

మునగపాక, న్యూస్‌టుడే: సమగ్ర భూసర్వేలో చోటుచేసుకొన్న తప్పుల తడకలను రెవెన్యూ సదస్సు దృష్టికి తీసుకురావాలని తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు అన్నారు. గంటవానిపాలెంలో సోమవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. పలువురు రైతులు తమకు ఎదురవుతున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. తహసీల్దార్ స్పందిస్తూ వీటిని సరిచేస్తామని హామీ ఇచ్చారు.

మేమున్నాం.. మీకు తోడుగా

అనకాపల్లి - 80085 74722
ఎలమంచిలి - 80085 74726
పాయకరావుపేట - 80085 74749

అనకాపల్లి పట్టణం, న్యూస్‌టుడే

?: అనకాపల్లిలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. కూడళ్ల వద్ద రద్దీగా ఉన్న ప్రాంతాల్లో కానిస్టేబుళ్లు లేరు. **– బాబి, అనకాపల్లి**

✓: కూడళ్ల వద్ద నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. ఇంకా ఎక్కడైనా సమస్య ఉంటే పరిష్కరిస్తాం. **– వెంకటరమణ, ట్రాఫిక్ సీఐ**

అభిజీత్ కార్మికుల ఆందోళన వాయిదా

అచ్యుతాపురం, న్యూస్‌టుడే: అభిజీత్ ఫెర్రో ఎల్లాయిస్ కంపెనీని వెంటనే తెరిపించాలని లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని కార్మికులు, సంఘం నాయకులు హెచ్చరించారు. మూడురోజుల పాటు కంపెనీ వద్ద నిర్వహిస్తున్న ఆందోళనను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు సోమవారం ప్రకటించారు. నాయకులు రొంగలి రాము, సోమునాయుడు, కార్మికులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న కార్మికులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


మామిడిపాలెంలో విద్యార్థి అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కశింకోట, కొత్తూరు(అనకాపల్లి), మునగపాక, న్యూస్‌టుడే: వెయిట్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో కశింకోట జడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తాచాటి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. అండర్-17 బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన సీహెచ్.వైశాలి, స్వర్ణ, బాలుర విభాగంలో ఎన్.ముకేశ్ కాంస్య, వై.డాన్ ప్రసాద్ కాంస్య పతకాలు సాధించారు. నవంబరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వీరు పాల్గొనున్నట్లు వ్యాయామ ఉపాధ్యాయులు వి.ప్రభాకర్ తెలిపారు. వీరిని సోమవారం హెచ్ఎం ఆచంట రవి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీ ఛైర్మన్ నక్కా నాగమణి తదితరులు అభినందించారు. తునిలో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో కశింకోట విద్యార్థులు ఎం.డి.ఎస్.లక్ష్మీ ప్రసన్న, వై.తేజేశ్వర్ స్వర్ణపతకాలు, జి.మనోజ్ శశిధర్. ఎస్.విశాల్, పి.కుసుమ కిరణ్, జి.లిఖితగ్రేస్ రజత, బి.శృతి కాంస్య పతకాలు సాధించారు. ఈ సందర్భంగా వీరిని పలువురు అభినందించారు. మామిడిపాలెం జడ్పీ పాఠశాల విద్యార్థి వి.ధనరాజ్ జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో 102 కేజీల విభాగంలో బంగారు పతకం సాధించాడు. ఇతనితో పాటు పీఈటీ గౌరిని హెచ్ఎం శ్రీధర్, యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చినబ్బాయ్, ఉపాధ్యాయులు సత్కరించారు. మునగపాక జడ్పీ పాఠశాల పదోతరగతి విద్యార్థిని ఆడారి మౌనిక అన్నపూర్ణ చదరంగం పోటీలకు ఎన్నికైందని హెచ్ఎం శ్రీనివాసరావు, పీఈటీ సన్యాసిరావు తెలిపారు. ఈ విద్యార్థినిని సోమవారం పలువురు అభినందించారు.

పాయకరావుపేట, ఎస్.రాయవరం, న్యూస్‌టుడే: రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు శ్రీప్రకాష్ విద్యార్థులు అర్హత సాధించారు. విశాఖలో జరిగిన అండర్-19 హ్యాండ్‌బాల్ పోటీల్లో బాలిక విభాగంలో పి.అలేఖ్య, ఆర్.వైష్ణవి, ఎన్.సాహితచందన, ఆర్.మోహిత ప్రతిభ చూపారు. బాలుర విభాగంలో ఎ.జ్యోతిష్‌కుమార్, జి.అభినయ్, బి.యశ్వంత్, కె.జితేంద్ర, ఆర్.కుమార్, వై.జయసత్యకుమార్, కె.వెంకటేష్, జి.మురళి, ఎన్.గోపి, బి.మౌనిక్ సత్తా చాటారు. ఈ విద్యార్థులను సంస్థ అధినేత సీహెచ్.వి.కె.నరసింహారావు అభినందించారు. ధర్మవరం-అగ్రహారం జడ్పీ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం శ్రీనివాసరావు సోమవారం తెలిపారు. జిల్లా స్థాయి అండర్-17 బాలికలు, బాలుర విభాగంలో బి.జయశ్రీ, కె.తోనేశ్వరి, టి.వివేక్, మనోజ్ ప్రతిభ చూపి, నెల్లూరు జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాధించారు. ఈవిద్యార్థులను పీడీ దీపిక, ఉపాధ్యాయులు అభినందించారు.


కశింకోటలో విద్యార్థులతో రవి


పేటలో ఎంపికైన విద్యార్థులు

పనిచేసిన వారికి సమాజంలో గుర్తింపు

ఎలమంచిలి, న్యూస్‌టుడే: ఎలమంచిలి సీఐగా షేక్ గఫూర్ అందరి మన్ననలు పొందారని పరవాడ డీఎస్పీ కె.సత్యనారాయణ అన్నారు. ఎలమంచిలి సీఐగా పనిచేసి బదిలీపై వెళ్లిన గఫూర్‌ను, ఎస్సైలుగా పనిచేసి బదిలీపై వెళ్లిన పాపినాయుడు, సింహాచలంలను రాత్రి ఎలమంచిలిలో ఘనంగా సన్మానించారు. ఎలాంటి పెద్ద కేసులను కూడా ఛేదించి నిందితులను పట్టుకోవడంలో అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. పనిచేసిన వారికి సమాజంలో ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. ఎలమంచిలి సీఐలు ధనుంజయరావు, చల్లా నర్సింగరావు, ఎస్సైలు ఉపేంద్ర, సావిత్రి, సిబ్బంది పాల్గొన్నారు.


గఫూర్‌ను సన్మానిస్తున్న డీఎస్పీ, సీఐలు



మైదానంపై మంచు దుప్పటి

మన్యం ప్రాంతాన్ని తలపించేలా చీడికాడ మండలంలో సోమవారం ఉదయం మంచు దట్టంగా కురిసింది. పచ్చని పొలాలపై మంచు దుప్పటిలా పరుచుకుంది. వాహన చోదకులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది. మంచుతెరలను చీలుస్తూ సూర్యకిరణాలు నేలను తాకడాన్ని 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది. - న్యూస్‌టుడే, చీడికాడ

నర్సీపట్నం

• నర్సీపట్నం • చోడవరం • మాడుగుల

సద్వినియోగంతో రాణింపు

'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీలు

విశ్వవ్యాప్త సమాచారం అందించే అంతర్జాలాన్ని సద్వినియోగం చేసుకుంటే ఏ రంగంలోనైనా రాణిస్తూ విజేతలుగా నిలవొచ్చని పలువురు విద్యార్థులు తమ అభిప్రాయం వ్యక్తం చేశారు. స్థానిక అమరావతి గ్రూప్ ఆఫ్ స్కూల్స్‌లో 'ఈనాడు' ఆధ్వర్యంలో ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా సోమవారం వ్యాసరచన పోటీలు జరిగాయి. 'ఇంటర్నెట్ వినియోగం వల్ల లాభనష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అంశంపై నిర్వహించిన పోటీలో 8, 9, 10 తరగతుల విద్యార్థులు పాల్గొన్నారు. అప్రమత్తంగా లేకుంటే ఆన్‌లైన్ మోసాలకు గురయ్యే ప్రమాదముందని వ్యాసాల్లో పేర్కొన్నారు. ప్రిన్సిపల్ ఎం.రామకృష్ణ పర్యవేక్షణలో ఉపాధ్యాయులు మణీశ్వర్, రామారావు, రవి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులు బి.మౌనిక, కె.హర్ష, ఆర్.లక్ష్మీజాగృతికి పాఠశాల కరస్పాండెంట్ కోటేశ్వరరావు ప్రశంసాపత్రాలు, బహుమతులు అందజేశారు. - న్యూస్‌టుడే, నర్సీపట్నం



వ్యాసరచన పోటీలో విద్యార్థులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న కరస్పాండెంట్ కోటేశ్వరరావు

తెరపై ఈనాడు

నర్సీపట్నం: శ్రీకృష్ణ ఆడి: విశ్వం, కళ్కి కపోజ్ 1995, లవ్ రెడ్డి, వీక్షణం, ఆడి2: వెట్టయన్, ఇద్దరు, ఆడి3: దేవర, ఆడి4: రోబోట్, రివైండ్, జనక.. అయితే గనక, రాజు: వెట్టయన్, విశ్వం, బంగార్రాజు: దేవర చోడవరం: శ్రీసాయిలక్ష్మి: వెట్టయన్ సాయిలక్ష్మి: విశ్వం, పూర్ణ: దేవర

జలాశయాలకు తూట్లు.. సాగునీరందక పాట్లు

రోలుగుంట, న్యూస్‌టుడే

జల వనరులు సమృద్ధిగా ఉంటే సాగు భూములన్నీ సస్యశ్యామలం అవుతాయి. అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యతను పాలకులు విస్మరిస్తున్నారు. ఫలితంగా సాగు నీరందక, వ్యవసాయం కలిసిరాక రైతులు, కూలీలు పట్టణ ప్రాంతాలకు వలస పోతున్నారు. కొందరు భవన నిర్మాణ కార్మికులుగా, మరికొందరు అపార్టుమెంట్ వాచ్‌మెన్లు పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు.

రోలుగుంట మండలంలోని 24 పంచాయతీల్లో 24,410 ఎకరాల సాగు భూములున్నాయి. ఏటా ఖరీఫ్‌లో వరి సాధారణ విస్తీర్ణం 1,342 హెక్టార్లు కాగా, ఈ ఏడాది 1,841 హెక్టార్లలో నాట్లు పడ్డాయి. చెరకు సాధారణ విస్తీర్ణం 445 ఎకరాలు కాగా ఈ ఏడాది 187 ఎకరాల్లోనే సాగైనట్లు వ్యవసాయ అధికారుల గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కుసర్లపూడి, జానకిరాంపురం, రొంగల



పూర్తికాని గుండుబాడు ఆనకట్ట

వ్యవసాయానికి దూరమవుతున్న రైతులు



కొమరవోలు ఆవ పార్లుకట్ట ఇలా..

పాలెం తదితర ప్రాంతాల్లో 1055 ఎకరాల్లో సరుగుడు సాగవుతోంది. గుండుబాడు, జగ్గంపేట, బిబిపాలెం, కొరిప్రోలుపాలెం తదితర ప్రాంతాలకు చెందిన రైతులు తమిళనాడు, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు వలసపోతున్నారు. సుమారు 1200 ఎకరాల విస్తీర్ణంలో ఆవ విస్తరించి ఉన్నప్పటికీ ఆధునికీకరణ పనులు చేపట్టకపోవడంతో కొమరవోలు, పడాలపాలెం, ఎగువకొత్తూరు ప్రాంతాల్లో 400 నుంచి 600 ఎకరాలకు మించి సాగునీరు అందడం లేదు. 1993లో గుండుబాడు వద్ద సుమారు రూ.40 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన గుండుబాడు ఆనకట్ట ప్రారంభం కాకుండానే శిథిలమైంది. నాటి నుంచి ఏటా ఉపాధి హామీ పథకంలో రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షల వరకు నిధులు ఖర్చు చేస్తున్నా.. రైతులకు ఎలాంటి ప్రయోజనం ఉండటం లేదు. రోలుగుంట, జె.నాయుడుపాలెం, శరభవరం, కుసర్లపూడి ప్రాంతాల్లో చెక్‌డ్యామ్‌లు ఉన్నప్పటికీ వాటికి మరమ్మతు చేపట్టకపోవడంతో శిథిలావస్థకు చేరాయి. ఏటా జలవనరుల అభివృద్ధి ప్రతిపాదనలు పంపుతున్నట్లు జలవనరుల శాఖ ఏఈ సూర్యనారాయణ చెబుతున్నారు.

ప్రభుత్వానికి నివేదిక

కొమరవోలు ఆవ ఆధునికీకరణ, గుండుబాడు ఆనకట్ట మరమ్మతుకు సంబంధించి ప్రభుత్వానికి నివేదిక అందజేయనున్నాం. జలవనరుల శాఖ మంత్రి, అధికారులను కలిసి సమస్యను వివరిస్తాం. - యర్రంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీపీ, రోలుగుంట



పాఠశాలల ప్రహరీలకు నిధులు: అయ్యన్న

నర్సీపట్నం అర్బన్, నాతవరం, న్యూస్‌టుడే: నర్సీపట్నం నియోజకవర్గంలోని పాఠశాలలు, కేజీబీవీల ప్రహరీల నిర్మాణానికి ఉపాధి హామీ పథకం నిధులు మంజూరు చేసినట్లు సభాపతి అయ్యన్నపాత్రుడు చెప్పారు. గొలుగొండ మండలంలో 17 పాఠశాలలకు రూ.1.55 కోట్లు, మాకవరపాలెం మండలంలోని తొమ్మిది పాఠశాలలకు 1.62 కోట్లు, నర్సీపట్నం మండలంలోని మూడు పాఠశాలలకు రూ.65.25 లక్షలు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. ఈ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సమగ్ర శిక్షా అభియాన్ అధికారులకు సూచించారు. నాతవరం, నర్సీపట్నం మండలాలకు చెందిన ఐదుగురికి సీఎం సహాయ నిధి చెక్కులు అందజేశారు. నాతవరానికి చెందిన పైల వెంకటరమణ, నర్సీపట్నంకు చెందిన జామి సాంబశివరావు, కర్రి గోవిందరావు, ఏలూరి సురేష్‌కుమార్, పెట్ల సత్యారావు చెక్కులు అందుకున్న వారిలో ఉన్నారు.



అధికారులతో సమావేశమైన అయ్యన్నపాత్రుడు



పైడమ్మపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణమూర్తి

రూ.5.26 కోట్లతో 36 అభివృద్ధి పనులు

కె.కోటపాడు: పల్లె పండగ కార్యక్రమంలో భాగంగా రూ.5.26 కోట్లతో 36 అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చెప్పారు. పైడమ్మపేట, మేడిచర్ల, రామయోగిఅగ్రహారం, ఎ.కోడూరు, చౌడువాడ, గొండుపాలెం గ్రామాల్లో సీసీ రోడ్లు, మురుగు కాలువలకు సోమవారం శంకుస్థాపన చేశారు. చౌడువాడ నుంచి మల్లంపాలెం మార్గంలో చిట్టిగెడ్డపై నిర్మించిన వంతెనను ప్రారంభించారు. మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు, నాయకులు మహేశ్, ఎరుకునాయుడు తదితరులు పాల్గొన్నారు.

అవీ ఇవీ

అగ్రిసెట్ ర్యాంకర్ జ్యోతికి సత్కారం

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: అగ్రిసెట్ 48వ ర్యాంకర్ ఎస్.జ్యోతిని బీఆర్ వ్యవసాయ పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ కార్తీక్ సత్కరించి రూ.5 వేలు అందజేశారు. బీఆర్ బీఈడీ కళాశాల ప్రిన్సిపల్ సురేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

నవగ్రహ మండపానికి శంకుస్థాపన

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: చిట్టియ్యలో మాణిక్యాంబ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నవగ్రహ మండపం నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన చేశారు. అర్చకులు సన్యాసిరావు, చిట్టిబి, కె.పి.అగ్రహారం సర్పంచులు మాణిక్యం, శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ చినబాబు తదితరులు పాల్గొన్నారు.

దుర్గాదేవి ఉత్సవాలకు విరాళం

కె.కోటపాడు, న్యూస్‌టుడే: కింతాడ శివారు గంగాభవానిపాలెంలో దుర్గాదేవి ఉత్సవాలు కొనసాగుతున్నాయి. ఉత్సవాల నిర్వహణకు తెదేపా క్లస్టర్ ఇన్‌ఛార్జి కర్నూరు సూర్యనారాయణ సోమవారం రూ.5 వేలు విరాళంగా అందజేశారు.

అయ్యప్ప దీక్షాస్వాములకు 'వడి'

రావికమతం, న్యూస్‌టుడే: కొత్తకోట అయ్యప్ప స్వామి గుడి వద్ద మాలధారణ భక్తులకు సోమవారం నుంచి 41 రోజులపాటు అల్పాహారం అందించే వడి కార్యక్రమం ప్రారంభమైంది. గ్రామానికి చెందిన 13 మంది దాతల సహకారంతో నిరాటంకంగా అమలు చేయనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

భూ సంబంధ సమస్యలపై వినతులు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో భూ సంబంధ సమస్యల పరిష్కారం కోరుతూ 15 వినతులు వచ్చాయి. పట్టాదారు పాసుపుస్తకం జారీ చేసినప్పటికీ ఆన్‌లైన్ చూపించలేదని నమోదు కాలేదని నర్సీపట్నంకు చెందిన శివ అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. రీసర్వేలో రికార్డుల మార్పిడి చేశారని పేరున నమోదు చేశారని రావికమతం మండలం గర్నికం వాసులు వాపోయారు.

సచివాలయ సిబ్బందికి అవగాహన సదస్సు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండల పరిషత్తు కార్యాలయంలో సచివాలయ సిబ్బందికి సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటైంది. ఎంపీడీవో అప్పారావు అధ్యక్షతన జరిగిన సదస్సులో ఎంపీపీ రాజారామ్, ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గ్రేడ్-5 పంచాయతీ కార్యదర్శులకు డీడీవో ఇచ్చిన నేపథ్యంలో గతంలో పని చేసిన మండలాల్లో పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని సూచించారు.

గంజాయి రవాణా కట్టడికి చర్యలు

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: గంజాయి రవాణా, వినియోగాన్ని కట్టడి చేసేందుకు చర్యలు చేపడతానని సీఐ గోవిందరావు చెప్పారు. బదిలీపై నర్సీపట్నం వచ్చిన ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టారు. పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారంపై దృష్టిసారిస్తానన్నారు.

సదుపాయాలు కల్పించకపోతే ఎలా?

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: ఏఎల్‌పురం ఆర్టీసీ కాంప్లెక్సులో కనీస వసతుల్లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని, సమస్యపై స్పందించకపోతే ఎలా అని సర్పంచి సుజాత నర్సీపట్నం ఆర్టీసీ డిపో మేనేజర్ ఎం.ఎస్.ధీరజ్‌ను సోమవారం ప్రశ్నించారు. ప్రజాప్రతినిధులతో కలిసి ఆయనకు వినతిపత్రం అందజేశారు.

పాఠశాల ఆవరణలో తుప్పల తొలగింపు

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: జోగుంపేట జడ్పీ పాఠశాల ఆవరణలో విద్యా కమిటీ సభ్యులు తుప్పల తొలగింపునకు శ్రీకారం చుట్టారు. విద్యార్థుల తల్లిదండ్రుల వినతి మేరకు విద్యా కమిటీ ఛైర్మన్ మురళి, ఉపాధ్యక్షుడు సింహాచలం కూలీలతో ఆవరణను శుభ్రం చేయించారు.

సీపీఎం మహాసభ

కృష్ణదేవిపేట: స్థానిక అల్లూరి సీతారామరాజు నందనవనంలో సీపీఎం 3వ మహాసభ సోమవారం జరిగింది. ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వెంకన్న, కోటేశ్వరరావు, రాజుబాబు పాల్గొన్నారు.

రెవెన్యూ కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నం డివిజన్ పరిధిలో తుపాన్‌ను సమర్థంగా ఎదుర్కొనేందుకు అధికారులంతా సన్నద్ధం కావాలని ఆర్డీవో వి.వి.రమణ ఆదేశించారు. సబ్ కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం ఆయా శాఖల ఉన్నతాధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. మంగళవారం తెల్లవారుజాము నుంచి కంట్రోల్ రూం పనిచేస్తుందన్నారు. అత్యవసరమైతే 70753 56563 నంబరులో సంప్రదించవచ్చని చెప్పారు. మున్సిపల్ కమిషనర్ సురేంద్ర, విద్యుత్తు ఈఈ రామకృష్ణారావు, డిప్యూటీ డీఎంహెచ్‌వో వీరజ్యోతి, జలవనరులు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాతవరం: తుపాను సమాచారంతో తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు వేణుగోపాల్ చెప్పారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ తక్షణ సహాయక చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. తాండవ జలాశయం అధికారులు, వీఆర్వోలతో సోమవారం సమీక్ష నిర్వహించారు. సమీక్షించారు. కంట్రోల్ రూమ్ అధికారిగా డీటీ రాజును నియమించారు. అత్యవసరమైతే 86399 77302 నంబరులో సంప్రదించవచ్చన్నారు.

బుచ్చెయ్యపేట: తుపాను హెచ్చరికల నేపథ్యంలో తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తహసీల్దారు లక్ష్మి తెలిపారు. ఈ నెల 24 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో ఉద్యోగులందరికీ ప్రత్యేక విధులు కేటాయించామన్నారు. నదీ పరీవాహక గ్రామాలైన వడ్డాది, విజయరామరాజుపేటలో వంతెనల వద్ద విధులు నిర్వహించేందుకు సిబ్బందిని నియమించామన్నారు. అవసరమైతే కంట్రోల్ రూమ్ నంబరు 73860 09882 కు ఫోన్ చేయాలని సూచించారు.

దేవరాపల్లి: అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 24 వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు లక్ష్మీదేవి సూచించారు. తహసీల్దారు కార్యాలయంలో ప్రత్యేకంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామన్నారు. అత్యవసరమైతే 70325 21509 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.



అధికారులకు సూచనలిస్తున్న ఆర్డీవో రమణ

500 క్యూసెక్కుల నీరు విడుదల

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: పెద్దేరు జలాశయం నుంచి 500 క్యూసెక్కుల నీటిని స్పిల్‌వే గేట్ల ద్వారా దిగువకు విడుదల చేసినట్లు పర్యవేక్షణాధికారి సుధాకర్‌రెడ్డి చెప్పారు. ఎగువ ప్రాంతాల నుంచి 265 క్యూసెక్కుల వరద జలాశయంలోకి వస్తోందన్నారు. వర్షాల నేపథ్యంలో నదీ పరీవాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపిక

నర్సీపట్నం, న్యూస్‌టుడే: నర్సీపట్నంకు చెందిన జాన్సన్, జయచందన్ జాతీయ స్థాయి స్కేటింగ్ పోటీలకు ఎంపికయ్యారు. కాకినాడలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో నర్సీపట్నం నుంచి ఐదుగురు విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ఇంటర్ విద్యార్థి జాన్సన్ అండర్-17 విభాగంలో 500 మీటర్ల రింక్, 3 వేల మీటర్ల రోడ్డు పోటీల్లో రెండు స్వర్ణ పతకాలు గెలుపొందాడు. అండర్ -11 విభాగంలో నాలుగో తరగతి విద్యార్థి జయచందన్ 500 మీటర్లు, వెయ్యి మీటర్ల రింక్ పోటీల్లో ద్వితీయ స్థానంలో నిలిచి రజత పతకాలు అందుకున్నాడు. వీరిని నర్సీపట్నం రూరల్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు వెలగా నారాయణరావు, కోచ్ మణికంఠ సోమవారం అభినందించారు.



జాన్సన్, జయచందన్

షాట్‌పుట్‌లో గురుకుల విద్యార్థి ప్రతిభ

నర్సీపట్నం, న్యూస్‌టుడే: స్థానిక గురుకుల పాఠశాల పదో తరగతి విద్యార్థి పవన్ సౌత్ జోన్ అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ చూపి పతకం గెలుపొందాడు. రాజమహేంద్రవరంలో ఇటీవల జరిగిన షాట్‌పుట్ పోటీల్లో అండర్-16 కేటగిరిలో కాంస్య పతకం అందుకున్నాడు. ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, వైస్ ప్రిన్సిపల్ సురేష్, పీఈటీ వినోద్ సోమవారం విద్యార్థిని అభినందించారు.



విద్యార్థి పవన్‌తో ప్రిన్సిపల్ రాజేంద్రప్రసాద్, ఉపాధ్యాయులు



విద్యార్థినులతో కేజీబీవీ ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి పోటీలకు కేజీబీవీ విద్యార్థినులు

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: వడ్డాది కేజీబీవీకి చెందిన విద్యార్థినులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. అండర్-19 విభాగంలో బాస్కెట్‌బాల్ పోటీలకు కె.బాంధవ్య, నెట్‌బాల్ పోటీలకు ఎ.వెంకటపద్మిని, వి.జ్ఞానేశ్వరి, ఎం.శ్యామల, హ్యాండ్ బాల్ పోటీలకు కార్తిక, యమున, తిరుమల, వాణి, ఫుట్‌బాల్ పోటీలకు పూజ, దీపిక, ఊర్మిళ, హాసిని, టెన్నీకాయిట్ పోటీలకు నిశ్విక, అండర్-17 హ్యాండ్ బాల్ పోటీలకు హేమ, అండర్-14 హ్యాండ్ బాల్ పోటీలకు దివ్య, లావణ్య ఎంపికయ్యారని ప్రిన్సిపల్ కె.అన్నపూర్ణ తెలిపారు. ఉపాధ్యాయులతో కలిసి సోమవారం అభినందించారు.

జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపిక

దేవరాపల్లి, న్యూస్‌టుడే: తెనుగుపూడి గురుకుల విద్యాలయానికి చెందిన ఇద్దరు విద్యార్థులు జోనల్ స్థాయి సైన్స్ ఫెయిర్‌కు ఎంపికయ్యారు. కొక్కిరాపల్లిలో ఈ నెల 18న జరిగిన జిల్లా స్థాయి ఫెయిర్‌లో విద్యార్థులు రామచరణ్, భవానీ ప్రసాద్ ఐటీ ఒకేషనల్ విభాగంలో స్పెషల్ ఎచీవ్‌మెంట్ అవార్డు అందుకున్నారని ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రఘు చెప్పారు. భూమి ఉపరితల వాతావరణంలో తక్కువ రేడియేషన్ ద్వారా మనుషులతోపాటు పశుపక్ష్యాదుల జీవిత కాలాన్ని పెంపొందించవచ్చనే అంశంపై రూపొందించిన నమూనాకు గుర్తింపు దక్కిందన్నారు. విద్యార్థులతోపాటు వారికి శిక్షణ ఇచ్చిన లక్ష్మణ్‌ను సోమవారం అభినందించారు.



సైన్స్ ఫెయిర్‌కు ఎంపికైన గురుకుల విద్యార్థులు

స్కూలు గేమ్స్‌లో విద్యార్థుల సత్తా

రోలుగుంట, న్యూస్‌టుడే: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నర్సీపట్నంలోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్ పోటీల్లో రోలుగుంట జడ్పీ పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. ఈ పోటీలకు ఆరుగురు హాజరుకాగా.. నలుగురు పతకాలు సాధించారు. బి.స్నేహ, పి.రామ్‌చరణ్, సింహాద్రి, అరుణ్ పతకాలు అందుకున్న వారిలో ఉన్నారు. విజేతలను ఎంఈవో అప్పారావు, ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్, ఉపాధ్యాయిని నాగజ్యోతి, వ్యాపారి నారాయణరావు అభినందించారు.



విజేతలతో ఉపాధ్యాయులు, నిర్వాహకులు

రవాణా ఛార్జీల్లేకుండా ఉచితంగా ఇవ్వాలి

నర్సీపట్నం అర్బన్, న్యూస్‌టుడే: గబ్బాడ యార్డులోని ఇసుక నిల్వలను రవాణా ఛార్జీలు వసూలు చేయకుండా ఉచితంగా పంపిణీ చేయాలని మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ డిమాండ్ చేశారు. వైకాపా నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం నర్సీపట్నంలో ఆందోళన చేపట్టారు. ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఆర్డీవో కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు. ఇసుక పంపిణీ ఉచితమని చెప్పి టన్నుకు రూ.1165 చొప్పున వసూలు చేయడమేంటని ప్రశ్నించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ సుబ్బలక్ష్మి, నాయకులు చింతకాయల సన్యాసిపాత్రుడు, రుత్తల యర్రాపాత్రుడు తదితరులు పాల్గొన్నారు.

అడ్డుకునేందుకు యత్నించింది మీరే కదా : తెదేపా

గబ్బాడ యార్డులో నిల్వ ఉన్న ఇసుకను ప్రజలకు ఇవ్వకుండా న్యాయస్థానంలో పిటిషన్ వేయించి అడ్డుకునేందుకు యత్నించిది మీరే కదా అని తెదేపా కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు ఓ ప్రకటనలో మాజీ ఎమ్మెల్యే గణేష్‌ను ప్రశ్నించారు. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు రెండు వేల టన్నులకుపైగా ఇసుక మాయమైన విషయాన్ని అప్పట్లోనే అయ్యన్నపాత్రుడు వెలుగులోకి తెచ్చారని గుర్తుచేశారు. కౌన్సిలర్లు శ్రీకాంత్, రాజులనాయుడు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరులకు ఘన నివాళి

కృష్ణదేవిపేట, న్యూస్‌టుడే: కృష్ణదేవిపేటలో పోలీసుల అమరవీరుల సంస్మరణ దినోత్సవం సోమవారం ఘనంగా జరిగింది. ఎస్సై తారకేశ్వరరావు, ఏఆర్ సిబ్బంది, యువకులు ర్యాలీ చేసి అంబేడ్కర్ విగ్రహం వద్ద నివాళులర్పించారు.

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థులు చదువుతోపాటు పోటీతత్వం అలవరచుకోవాలని సీఐ అప్పలరాజు తెలిపారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ప్రధాన కూడళ్లో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పోలీసు సర్కిల్ కార్యాలయంలో కళాశాలల విద్యార్థులకు క్విజ్, వ్యాస రచన పోటీలు నిర్వహించారు. వ్యాసరచనలో ఉషోదయా కళాశాలకు చెందిన వి.సంకీర్తన, ఎ.నిత్యసంతోషి, సింధుశ్రీ విజేతలుగా నిలిచారు. క్విజ్‌లో మొదటి బహుమతి ఎ.నిత్యసంతోషి, సింధుశ్రీ, ద్వితీయ బహుమతి ఎస్.రామకృష్ణ, నాగదుర్గాభవాని, తృతీయ బహుమతి త్రివేణి సాధించారు. ఉత్తమ అవార్డు శ్రీవిజ్ఞాన్ కళాశాలకు చెందిన జి.భవాని అందుకుంది. విజేతలకు ఎస్సై నాగకార్తిక్‌తో కలిసి బహుమతులు అందజేశారు.

రావికమతం: పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా కొత్తకోటలో సోమవారం ర్యాలీ నిర్వహించి మానవహారంగా ఏర్పడ్డారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు నివాళులర్పించారు. పోలీసులు, యువకులు, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కె.కోటపాడు: కె.కోటపాడు, ఎ.కోడూరు పోలీసు స్టేషన్లలో సిబ్బంది నివాళులర్పించారు. సీఐ పైడపునాయుడు, ఎస్సైలు ధనుంజయ, లక్ష్మీనారాయణలు పాల్గొన్నారు.



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న సీఐ అప్పలరాజు, ఎస్సై నాగకార్తిక్



కృష్ణదేవిపేటలో నివాళులర్పిస్తున్న పోలీసులు, యువకులు



కొత్తకోట కూడలిలో మానవహారం

నేటి నుంచి ఆధార్ శిబిరాలు

మాడుగుల గ్రామీణం, న్యూస్‌టుడే: మండలంలో మంగళవారం నుంచి సంచార ఆధార్ నమోదు కేంద్రాలను నిర్వహించనున్నట్లు ఎంపీడీవో అప్పారావు చెప్పారు. 22న ఒమ్మలి, ఎం.కోటపాడు, జాలంపల్లి, మాడుగుల, 23న జి.అగ్రహారం, జేడీపేట, శంకరం, 24న సత్యవరం, అవురువాడ, తాటిపర్తి, 25న ముకుందపురం, పొంగలిపాక, వీజేపురం, సాగరం గ్రామాల్లో ఈ శిబిరాలు కొనసాగుతాయన్నారు.

మాకవరపాలెం: మండలంలో మంగళవారం నుంచి శుక్రవారం వరకు ప్రత్యేక ఆధార్ నమోదు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఇన్‌ఛార్జి ఎంపీడీవో సీతామహాలక్ష్మి చెప్పారు. రోజుకు మూడు గ్రామాల్లో కేంద్రాలు పనిచేస్తాయన్నారు. 22న బూరుగుపాలెం, జంగాలపల్లి, భీమబోయినపాలెం, 23న మాకవరపాలెం, జి.వెంటాపురం, గిడుతూరు, 24న వజ్రగడ, మాకవరపాలెం, జి.కోడూరు, 25న పాపయ్యపాలెం, తూటిపాల, మాకవరపాలెం పాఠశాలల్లో ఆధార్ అప్‌డేట్, ఏడేళ్ల వయసులోపు పిల్లలకు ఆధార్ నమోదుకు అవకాశం ఉందన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా

నర్సీపట్నం - 80085 74743

చోడవరం - 80085 74732

మాడుగుల - 80085 74737

గొలుగొండ, న్యూస్‌టుడే

?: పప్పుశెట్టిపాలెం - ఆరిలోవ అటవీ ప్రాంతం మధ్య రహదారి మలుపుల్లో తుప్పలు ప్రమాదకరంగా పెరిగాయి. వాహనాలు దగ్గరకు వచ్చే వరకు కనిపించక ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

- జి.రాధాకృష్ణ, పప్పుశెట్టిపాలెం

✓: సమస్యను గుర్తించాం. త్వరలో తుప్పలను తొలగిస్తాం. - ప్రసాదరావు, జేఈ, ర.భ.శా.



కె.కోటపాడు, న్యూస్‌టుడే

?: గొండుపాలెం నుంచి రొంగలినాయుడుపాలెం వరకు 3.5 కి.మీ. దూరం తారురోడ్డు నిర్మించి రెండు దశాబ్దాలు అవుతోంది. నాటి నుంచి మరమ్మతు చేయకపోవడంతో దారంతా గోతులు పడ్డాయి. రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం. - పైడం నాయుడు, రొంగలినాయుడుపాలెం

✓: రోడ్డును పరిశీలించి మరమ్మతుకు ప్రతిపాదనలు పంపుతాం. - రమేశ్, ఏఈ



పొలాలకు దారి పునర్నిర్మాణం

బుచ్చెయ్యపేట, న్యూస్‌టుడే: పొలాలకు వెళ్లేందుకు రైతులు సొంతంగా దారిని పునర్నిర్మించుకున్నారు. విజయరామరాజుపేట వద్ద తాచేరు వంతెన పక్కగా పొలాలు, కల్లాలకు వెళ్లే దారికి ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గండి పడింది. అప్పట్నుంచి రాకపోకలు సాగించేందుకు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నీటిలోకి దిగి వెళ్లాల్సి వచ్చేది. నదిలో ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు రాకపోకలు నిలిచిపోయేవి. రైతు కోరిబిల్లి అప్పలనాయుడికి చెందిన ఎద్దు ఆదివారం తాచేరులో దిగి మృతి చెందిన ఘటనతో రైతులందరూ అత్యవసరంగా పైపులు వేసి గండిని పూడ్చారు.



పొలాలకు వెళ్లే దారి

ఉన్నత లక్ష్యం దిశగా అడుగేయాలి

చోడవరం పట్టణం, న్యూస్‌టుడే: విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఆ దిశగా అడుగేయాలని ఎస్సై శివకార్తికేయ సూచించారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథం ఆధ్వర్యంలో విద్యార్థులకు ర్యాగింగ్‌పై సోమవారం అవగాహన సదస్సు ఏర్పాటైంది. ర్యాగింగ్ జరిగితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అనంతరం ఎస్సైను ఇన్‌ఛార్జి ప్రిన్సిపల్ రత్నభారతి, అధ్యాపకులు, విద్యార్థులు సన్మానించారు. అధ్యాపకులు మాల్యాద్రి, బిచ్చమ్మ, రఫూద్దీన్, సుధీర్, జ్యోతి, లక్ష్మీమంగమ్మ, కృష్ణారావు పాల్గొన్నారు.

చెరువులను పరిరక్షించాలి వినతి

మాకవరపాలెం, న్యూస్‌టుడే: ఆక్రమణలకు గురైన చెరువు గర్భాలను స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి ప్రతినిధులు సోమవారం ఉప తహసీల్దారు సోమశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు. సమితి వ్యవస్థాపకుడు మరిచర్ల కృష్ణమూర్తినాయుడు మాట్లాడుతూ.. మాకవరపాలెం మండలంలో సర్వే నంబరు 171లోని కమిశెట్టివాని చెరువు విస్తీర్ణం 8.42 ఎకరాలు కాగా.. ఇందులో 4.6 ఎకరాలు ఆక్రమణలకు గురైందన్నారు. నాయకులు సీతారామ్, గోపాలరావు, రాజునాయుడు, పాపారావు, శర్మ, రామ్మోహన్‌మురళి తదితరులు పాల్గొన్నారు.



ఉప తహసీల్దారుకు వినతిపత్రం ఇస్తున్న సమితి ప్రతినిధులు

పెందుర్తి

తెరపై ఈనాడు
పెందుర్తిలో..
లక్ష్మీకాంత్
స్క్రీన్-1 - దేవర
స్క్రీన్-2 - విశ్వం

దుర్గమ్మ సన్నిధిలో ఎమ్మెల్యే దంపతులు

సబ్బవరం , న్యూస్‌టుడే : పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు సోమవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన దుర్గమ్మను సతీ సమేతంగా దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. పండితులు వేదమంత్రాలతో ఆశీర్వచనం అందించారు.



రైతుల సమస్యలను పరిష్కరించాలని వినతి

దేవాడ(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని వార్డు తెదేపా అధ్యక్షుడు పాల అచ్చిలనాయుడు కోరారు. ఈ మేరకు దేవాడ రైతు సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి సోమవారం నమ్మిదొడ్డి, గొల్లపేట సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాడ ఈనాం భూముల్లో వేలాది ఎకరాల్లో వరి, మామిడి, జీడిమామిడి, సరుగుడు, కొబ్బరి, కూరగాయలు తదితర పంటలను సాగు చేస్తూ రైతులు జీవనం సాగిస్తున్నారన్నారు. అన్నదాతలకు రైతు భరోసా పథకం సొమ్ముతో పాటు రాయితీపై విత్తనాలు, వ్యవసాయ పరికరాలు అందజేయకపోవడంతో నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం ఇక్కడి రైతులను కౌలు రైతులుగా గుర్తించి అన్ని పథకాలను వర్తింపజేయాలన్నారు. నాయకులు కాకి శ్రీను, పాల నగేశ్, కాకి నారాయణ, సర్వరే ఆలం రాజా, అత్తిలి లక్ష్మణ పాల్గొన్నారు.


సచివాలయ సిబ్బందికి వినతిపత్రం అందజేస్తున్న అచ్చిలనాయుడు తదితరులు

పరాయి పంచన అంగన్వాడీ సేవలు

పరవాడ, న్యూస్‌టుడే: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించి వివిధ అంశాలపై అవగాహన కల్పించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో మంచి సేవలు అందించడంతో పాటు ప్రీస్కూల్ నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. పలు గ్రామాల్లో ఏళ్ల గడుస్తున్నా అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేకపోవడంతో ఇరుకుగా ఉన్న, సరైన సౌకర్యాలు లేని అద్దె భవనాల్లో నెట్టుకురావడంతో చిన్నారులతో పాటు నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత తెదేపా ప్రభుత్వ హయాంలో ప్రారంభించిన అంగన్వాడీ భవనాల పనులను అనంతరం వచ్చిన వైకాపా ప్రభుత్వం ఐదేళ్ల పాటు కనీసం పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి.


సగంలో నిలిచిపోయిన బాపడుపాలెం అంగన్వాడీ భవన నిర్మాణం

చిన్నారుల ఆలనాపాలనకు సరిపోక..

పరవాడ మండలంలోని పలు గ్రామాల్లో అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేని కారణంగా చిన్నారులు, గర్భిణులు, బాలింతల అవస్థలను దృష్టిలో ఉంచుకుని 2014-19 మధ్య కాలంలో అప్పటి తెదేపా ప్రభుత్వం స్పందించి ఒక్కో భవన నిర్మాణానికి ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.10 లక్షలు మంజూరు చేసింది. 2018లో శంకుస్థాపన చేసి పనులను వేగవంతం చేశారు. సుమారు 60 నుంచి 80 శాతం వరకు పనులు పూర్తి చేశారు. అనంతరం 2019లో అధికారంలోకి వచ్చిన వైకాపా ప్రభుత్వం వీటిని కనీసం పట్టించుకోకపోవడంతో అసంపూర్తిగా దిక్కులు చూస్తున్నాయి. భవనాలు అందుబాటులోకి రాకపోవడంతో కేంద్రాలను అద్దె, ప్రయివేట్ భవనాలు, సామాజిక, పాఠశాలల్లో నెట్టుకొస్తున్నారు. ఈ భవనాలు చిన్నారుల ఆలనపాలనతో పాటు సరకులు పెట్టుకోవడానికి సరిపోక, సరైన వసతులు లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. కొన్ని భవనాలు శిథిలావస్థలో ఉండడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.


రేఖవానిపాలెంలో..

మండలంలోని ఈ గ్రామాల్లో..

పరవాడ మండలంలోని రేఖవానిపాలెం, గొల్లగుంట, మోటూరువానిపాలెం, సోమునాయుడుపాలెం, గొల్లలపాలెం, పాతరాజానపాలెం, పోలిరెడ్డిపాలెం, గొర్లెవానిపాలెం, బాపడుపాలెం, స్వయంభూవరం, వెంకటాపురం, విస్సన్నపేట గ్రామాల్లో భవనాల పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి. గత వైకాపా ప్రభుత్వం కొంత దృష్టి సారించినా వీటి పనులు పూర్తయ్యేవని కనీసం పట్టించుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అసంపూర్తి భవనాలను పూర్తి చేయాలని పలుమార్లు అప్పట్లో పాలకులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఎటువంటి ప్రయోజనం లేకపోయిందని వాపోతున్నారు. కూటమి ప్రభుత్వం స్పందించి అంగన్వాడీ భవన నిర్మాణాలను పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

పంచాయతీల్లో సచివాలయాలను విలీనం చేయాలి

పరవాడ, న్యూస్‌టుడే: గ్రామ పంచాయతీల్లో సచివాలయాలను విలీనం చేయాలని ముత్యాలమ్మపాలెం సర్పంచి, ఉమ్మడి జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షురాలు చింతకాయల సుజాత కోరారు. ఈ మేరకు అనకాపల్లి జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవిని సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. పంచాయతీకి ఒక సచివాలయాన్ని కేటాయించి సచివాలయ సిబ్బందిని అనుసంధానం చేయాలన్నారు. గత వైకాపా ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి సచివాలయంలో 11 మంది ఉద్యోగులను నియమించిందని, వారిపై సరైన పర్యవేక్షణ, నియంత్రణ లేకపోవడంతో తీవ్ర గందరగోళంగా తయారైందన్నారు. ఒక్కో పంచాయతీలో రెండు కంటే ఎక్కువ సచివాలయాలను ఏర్పాటు చేశారని అవసరం కంటే ఎక్కువమంది ఉద్యోగులు ఉండటం వల్ల వారికి పని లేకుండా పోయిందన్నారు. కార్యక్రమంలో ముత్యాలరావు, రవి పాల్గొన్నారు.


జేసీకి వినతిపత్రం అందజేస్తున్న సర్పంచి సుజాత

నేడు విద్యుత్తు సరఫరాకు అంతరాయం

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ సబ్‌స్టేషన్ పరిధిలో నిర్వహణ పనులు చేపట్టనున్నందున పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగనుందని ఏపీఈపీడీసీఎల్ కశింకోట డివిజన్ ఈఈ రామకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. దేశపాత్రునిపాలెం, ఎస్సీకాలనీ, శేషాద్రినగర్, సాయినగర్‌కాలనీ, పి.భోనంగి సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రాంతంలో ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సరఫరా ఉండదని వెల్లడించారు.

అబ్దుల్‌కలాం ఐపీఆర్ జాతీయ క్విజ్ పోటీలు

సబ్బవరం, న్యూస్‌టుడే: ఏపీజే అబ్దుల్ కలాం మేధో హక్కుల సంపత్తి(ఐపీఆర్) జాతీయ క్విజ్ పోటీలు సోమవారం అంతర్జాలంలో నిర్వహించారు. దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం(డీఎస్ఎన్ఎల్‌యూ)లోని మేధో హక్కుల సంపత్తి, అంతర్జాతీయ వ్యాపార విభాగం(డీపీఐబీటీ) కేంద్రాలు ఈ పోటీలకు సహకారం అందించాయి. మేధో సంపత్తి హక్కులపై విద్యార్థులకు పరిజ్ఞానాన్ని పెంపొందించేందుకు జాతీయ స్థాయిలో ఈ పోటీ నిర్వహించడం జరిగిందని వర్సిటీ ఒక ప్రకటనలో తెలిపింది. డీఎస్ఎన్ఎల్‌యూ ఉపకులపతి ఆచార్య సూర్యప్రకాశరావు మాట్లాడుతూ ఈ పోటీని విద్యార్థులు ఒక అవకాశంగా తీసుకోవాలన్నారు. దేశం నలుమూలల నుంచి 24 జట్లు పాల్గొన్నాయి. పుణెలోని సింబయాసిస్ లా స్కూల్ నుంచి జైన్, సవ్యసాచి, నందిత బృందం విజేతగా నిలిచి రూ.5 వేలు, బెంగళూరులోని అలయన్స్ యూనివర్సిటీకి చెందిన కడిమి లక్ష్మి, హర్షిత, మజ్జారి పావని బృందం రన్నరప్‌గా నిలిచి రూ.3 వేల నగదు బహుమతి గెలుచుకున్నారు. డీఎస్ఎన్ఎల్‌యూ ఫ్యాకల్టీ సమన్వయకర్త, డీపీఐబీటీ ఐపీఆర్ ఛైర్ ప్రొఫెసర్ దయానందమూర్తి, డాక్టర్ నీలిమ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

ఇస్లాంపేట(పరవాడ), న్యూస్‌టుడే: జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేట జిల్లా పరిషత్తు ఉన్న పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు విశాఖ ఉమ్మడి జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి హాకీ, చెస్ పోటీలకు ఎంపికయ్యారు. స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలోని ఈనెల 10న పోర్టు హైస్కూల్ మైదానంలో జరిగిన అండర్-17 చెస్ పోటీల్లో పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు చెందిన అనిత బోహిపాయి, పురుషోత్తం వాసవి హాకీలో రాణించగా నీతాకుమారి అనకాపల్లి జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో జరిగిన అండర్ -17 చెస్ పోటీల్లో ప్రతిభ చాటిందని. ఈ ముగ్గురు త్వరలోనే జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని పీడీ ఎస్.నర్సింహమూర్తి తెలిపారు. సోమవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలను ప్రధానోపాధ్యాయిని జి.ప్రమీల, ఉపాధ్యాయులు అభినందించారు.


ప్రధానోపాధ్యాయురాలు ప్రమీల, పీడీ నర్సింహామూర్తితో ఎంపికైన బాలికలు

పరవాడలో రెవెన్యూ సదస్సు రేపు

పరవాడ, న్యూస్‌టుడే: మండల కేంద్రం పరవాడ సంతబయలు వద్ద బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ అంబేడ్కర్ సోమవారం తెలిపారు. షెడ్యూల్ ప్రకారం పరవాడలో మంగళవారం ఈ సదస్సు జరగాల్సి ఉండగా వారపుసంత కారణంగా బుధవారానికి వాయిదా వేయడం జరిగిందన్నారు. రీసర్వేలో సమస్యలు ఉన్న వారు సదస్సుల్లో పాల్గొని అర్జీలు పెట్టుకోవాలన్నారు.

ప్రయాణమంటే సాహసం చేయాల్సిందే..!

సబ్బవరం, న్యూస్‌టుడే: ఆ దారిలో ప్రయాణించాలంటే సాహసం చేయాల్సిందే.. లేదంటే 26 కిలోమీటర్లు చుట్టూ తిరిగి గమ్యస్థానానికి చేరుకోవాలి. సబ్బవరం మండలం అసకపల్లి నుంచి పరవాడ మండలం లంకెలపాలెం వెళ్లే రహదారిలో ప్రయాణం నానాటికీ ప్రమాదకరంగా మారుతోంది. రాకాసి గుంతలు కారణంగా వర్షపు నీరు నిలిచిపోయి బురదగా మారుతోంది. ద్విచక్రవాహన, ఆటో చోదకులు భయాందోళన మధ్య రాకపోకలు సాగిస్తున్నారు. ఏ వాహనం ఎప్పుడు కూరుకుపోతోందో తెలియని పరిస్థితి. సోమవారం అసకపల్లి నుంచి లంకెలపాలెం వెళ్తున్న ఓ ఆటో అసకపల్లి దాటిన వెంటనే ఓ గుంత వద్ద అదుపుతప్పి ఒరిగిపోతుండగా ఇతర ఆటో చోదకులు ఆటోను పట్టుకుని ప్రయాణికులను కిందకు దించి రక్షించారు. సబ్బవరం మండలానికి చెందిన వారు లంకెలపాలెం వెళ్లాలంటే అసకపల్లి నుంచి అనకాపల్లి వెళ్లి అక్కడి నుంచి లంకెలపాలెం వెళ్తున్నారు. దీనివల్ల 12 కిలోమీటర్లకు బదులు అదనంగా మరో 14 కిలోమీటర్లు ప్రయాణించాల్సి వస్తోంది. దీనివల్ల ప్రయాణికుల నుంచి రెట్టింపు వసూలు చేయాల్సి వస్తోందని ఆటో చోదకులు వాపోతున్నారు. దీనివల్ల ప్రజలు ఆటోలు ఎక్కడం మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి రహదారికి మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.


బురదగా మారిన రహదారి


ఒరిగిపోతున్న ఆటోను పట్టుకుంటున్న డ్రైవర్లు

యూసీడీ ఇన్‌ఛార్జి ఏపీడీగా చిరంజీవి

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-8 యూసీడీ ఇన్‌ఛార్జి ఏపీడీగా టి.చిరంజీవి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జీవీఎంసీ పలు విభాగాల్లో నిర్వహించిన బదిలీల్లో భాగంగా జోన్-5 యూసీడీ ఏపీడీగా పనిచేసిన చిరంజీవి జోన్-8కు వచ్చారు. ఇక్కడ పనిచేసిన ఏపీడీ శ్రీరాం మధురవాడకు బదిలీ అయ్యారు. విధుల్లో చేరిన చిరంజీవిని వివిధ సచివాలయాల కార్యదర్శులు, పొదుపు సంఘాల మహిళలు జోనల్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు.



విద్యార్థుల పారిశ్రామిక సందర్శన

పెందుర్తి, న్యూస్‌టుడే: పెందుర్తి ఆదర్శ్ డిగ్రీ కళాశాల బీబీఏ విద్యార్థుల పారిశ్రామిక సందర్శన సోమవారం నిర్వహించారు. అధ్యాపకురాలు జి.పరిమళ ఆధ్వర్యంలో విద్యార్థులు చోడవరంలోని సహకార చక్కెర కర్మాగారాన్ని సందర్శించినట్లు ప్రిన్సిపల్ ఎన్.ఈ.ఫ్లోరా తెలిపారు. మేనేజ్‌మెంటు విద్యలో భాగంగా విద్యార్థులకు క్షేత్రస్థాయి అనుభవం కోసం ఈ సందర్శన ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.


చోడవరం చక్కెర కర్మాగారంలో విద్యార్థులు

విద్యార్థులకు వైద్య పరీక్షలు

పరవాడ, న్యూస్‌టుడే: రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం(ఆర్‌బీఎస్‌కే)లో భాగంగా జీవీఎంసీ 77వ వార్డు పరిధి దేవాడ మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రదీప్ ప్రసాదురాజా, సిబ్బంది విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. పిల్లలకు పుట్టుకతో వచ్చే 4డీ వ్యాధుల నిమిత్తం స్క్రీనింగ్ చేశారు. వ్యక్తిగత పరిశుభ్రత, ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో సీహెచ్ఎన్ అన్నపూర్ణ, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు, హెచ్ఎస్ గోపాలం, దేవి తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రదీప్‌ప్రసాదురాజా

నిరుపయోగంగా బస్‌షెల్టర్



షోకేస్

పరవాడ, న్యూస్‌టుడే: పరవాడ మండల పరిషత్తు కూడలిలో బస్‌షెల్టర్ పరిసరాలు అధ్వానంగా తయారయ్యాయి. షెల్టర్ పరిసరాల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరగడంతో పాటు విష పురుగుల సంచారం కారణంగా షెల్టర్‌ను ప్రయాణికులు వినియోగించడం లేదు. లోపల బెంచీలు దుమ్ము, ధూళితో దర్శనమిస్తున్నాయి. కూడలిలోని విద్యాశాఖ, తహసీల్దార్, మండల పరిషత్తు, వెలుగు, ఉపాధిహామీ, పోస్టల్, పశువైద్యం, హౌసింగ్, వ్యవసాయ తదితర కార్యాలయాలు ఉండటంతో ఇక్కడి నుంచి ఎక్కువమంది ఉద్యోగులతో పాటు ప్రజలు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. వీరంతా బస్సులు వచ్చేవరకు ప్రయాణికులు బయటే ఉండాల్సిన పరిస్థితి నెలకొంటోంది. షెల్టర్ ఉన్నా ఉపయోగం లేదని వాపోతున్నారు. పంచాయతీ అధికారులు స్పందించి షెల్టర్ పరిసరాలను శుభ్రం చేయించి వినియోగంలోకి తేవడానికి చర్యలు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

సరిపల్లి వాసికి ఆంధ్రరత్న పురస్కారం

సరిపల్లి(పెందుర్తి), న్యూస్‌టుడే: పెందుర్తి మండలం సరిపల్లి గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త కోనేటి ఆదినారాయణకు అఖిల భారత సాంస్కృతిక సంఘం ఆంధ్రరత్న పురస్కారాన్ని ప్రదానం చేసింది. విజయవాడలో సోమవారం నిర్వహించిన సంఘం వార్షికోత్సవాల్లో భాగంగా ఈ పురస్కారాన్ని అందజేసినట్లు ఆదినారాయణ తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా వివిధ సామాజిక సేవా కార్యక్రమాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించిన నేపథ్యంలో ఈ పురస్కారానికి ఎంపిక చేసినట్లు ఆదినారాయణ పేర్కొన్నారు.


అతిథుల చేతులమీదుగా పురస్కారం అందుకుంటున్న ఆదినారాయణ

జిల్లాలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు

వన్‌టౌన్, న్యూస్‌టుడే: జిల్లాలోని 29 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు జిల్లా సంయుక్త కలెక్టర్ మయూర్ అశోక్ తెలిపారు. ఈ మేరకు కలెక్టర్ హరేంధిరప్రసాద్ సోమవారం ఎన్నిక నోటిఫికేషన్ విడుదల చేశారని చెప్పారు. ఆయా సాగునీటి ఆయకట్టు పరిధిలోని రైతులు సభ్యులుగా ఉంటారని చెప్పారు. నవంబరు 21 నుంచి 23 వరకు ఎన్నికలు జరుగుతాయన్నారు. ఈలోపు ఓటరు జాబితాల తయారీ, ప్రాదేశిక నియోజకవర్గాల ఏర్పాటు తదితర ప్రక్రియలను పూర్తి చేస్తామన్నారు.

రెవెన్యూ గ్రామ సభకు 82 దరఖాస్తులు


రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్న రెవెన్యూ సిబ్బంది

సబ్బవరం, న్యూస్‌టుడే: సబ్బవరం మండలం అసకపల్లి శివారు ఎరుకనాయుడుపాలెం గ్రామంలో సోమవారం రెవెన్యూ గ్రామ సభ నిర్వహించారు. రీసర్వేలో తమకు అన్యాయం జరిగిందని, భూమి తగ్గిపోయిందని, తమ పేర్లు తప్పుగా నమోదయ్యాయని 82 మంది రైతులు అభ్యంతరాలతో కూడిన దరఖాస్తులు అందించారు. ఈ సందర్భంగా తహసీల్దారు బి.చిన్నికృష్ణ మాట్లాడుతూ గ్రామంలో మొత్తం 90 సర్వే నెంబర్లు ఉన్నాయన్నారు. ప్రభుత్వ భూమి 485.89 ఎకరాలు, జిరాయితీ 431 ఎకరాలు అని తెలిపారు. కార్యక్రమంలో రీసర్వే డీటీ వై.గణేశ్, సర్వేయర్లు ఎల్.అప్పారావు, రాంబాబు, వీఆర్వోలు దొగ్గ ఈశ్వరరావు, సర్పంచి కర్రి నర్సింగరావు, చల్లా అప్పలనాయుడు, మొల్లి చిన్నారావు, గవర సత్యనారాయణ, గవర అప్పారావు తదితరులు పాల్గొన్నారు

రహదారిలో గోతుల పూడ్చివేత

పురుషోత్తపురం(పెందుర్తి), న్యూస్‌టుడే: జీవీఎంసీ 95వ వార్డు పరిధిలోని పురుషోత్తపురం - కంఫర్ట్ హోమ్స్ రహదారిలో గోతులు కారణంగా ఇబ్బంది పడుతున్నామని కాలనీవాసులు వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు దృష్టికి తీసుకెళ్లారు. ఆ మేరకు ఆయన ఆదివారం కాలనీలో పర్యటించి సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. యూజీడీ పనుల కారణంగా ఏర్పడిన గోతులను సోమవారం జీవీఎంసీ సిబ్బందితో పూడ్చివేయించారు.


గోతుల్లో కాంక్రీటు వేస్తున్న దృశ్యం

పట్టపగలే వెలుగులు

పరవాడ, న్యూస్‌టుడే: అధికారుల నిర్లక్ష్యం కారణంగా వీధుల్లోని విద్యుత్తు దీపాలు నిత్యం వెలుగుతూ విద్యుత్తును వృథా చేస్తున్నాయి. పరవాడ సినిమా హాల్ కూడలిలోని ఎల్ఈడీ దీపం గతకొద్ది రోజులుగా నిరంతరాయంగా వెలుగుతున్నా పట్టించుకునే వారే కరవయ్యారని స్థానికులు వాపోతున్నారు. విద్యుత్తు పొదుపు గురించి అవగాహన కల్పించే అధికారులు విద్యుత్తును వృథా చేయడం పట్ల గ్రామస్థులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పగటి వెలుగులకు అడ్డుకట్ట వేయాలని కోరుతున్నారు.



మంచినీటి బోర్లకు మరమ్మతులు

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ జోన్-8 పరిధిలోని పలువార్డుల్లో పాడైన బోర్లకు మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది సోమవారం మరమ్మతులు చేశారు. 'బోరుమంటున్నాయి' శీర్షికతో ఈనెల 20న ఆదివారం 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి సంబంధిత శాఖ అధికారులు స్పందించారు. వెంటనే జోన్ పరిధిలో అన్ని మంచినీటి బోర్లను ఒకేసారి సిబ్బందితో పరిశీలన చేయించారు. పాడైన చేతిపంపుల్లో మంచినీరు వచ్చేవాటిని ముందుగా బాగు చేయించారు. 93వ వార్డు మోదీస్ట్రీట్, విరాట్‌నగర్, 98వవార్డు సింహపురికాలనీల్లో బోర్లు వెంటనే బాగు చేయించారు. దీంతో కాలనీవాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


మోదీస్ట్రీట్‌లో బోరు బాగు చేస్తున్న జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం సిబ్బంది

పైపులైన్ లీకేజీకి అడ్డుకట్ట

స్పందనకు వందనం

పరవాడ, న్యూస్‌టుడే: మేజరు పంచాయతీ పరవాడ బొంకుల దిబ్బ వీధిలోని తాగునీటి పైపులైన్‌కు సోమవారం సంబంధిత సిబ్బంది మరమ్మతులు చేపట్టారు. ఇక్కడి రహదారిని ఆనుకుని ఉన్న రక్షిత మంచినీటి పథకానికి చెందిన పైపులైన్ దెబ్బతిని గత కొద్దిరోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. 'తాగునీరు నేలపాలు' శీర్షికతో ఈనెల 19న 'ఈనాడు'లో ప్రచురితమైన వార్తకు పంచాయతీ అధికారులు స్పందించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయించి తాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.


తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

వైభవంగా విగ్రహాల ప్రతిష్ఠ

సుజాతనగర్ (పెందుర్తి), న్యూస్‌టుడే: సుజాతనగర్‌లోని పూర్ణ పుష్కల సమేత ధర్మశాస్తా అయ్యప్ప స్వామి దేవాలయంలో సోమవారం విగ్రహ ప్రతిష్ఠాపన వైభవంగా నిర్వహించారు. సాంబసదాశివుడి వాయు ప్రతిష్ఠ, నంది విగ్రహం, అయ్యప్ప స్వామి సన్నిధిలో మహాగణపతి, మాలికాపురమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన జరిపారు. సుజాతనగర్‌కు చెందిన విగ్రహదాతలు రామునాయుడు, చంద్రకళ, ఐ.భాస్కరరావు, ప్రవల్లిక దంపతులు అధివాస పూజల్లో పాల్గొన్నారు. ఆలయ ధర్మకర్త వాకా చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు విశేష పూజలు, హోమాలు జరిపారు. అనంతరం ఆలయ శిఖర కలశ ప్రతిష్ఠాపన సంప్రదాయబద్ధంగా జరిగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.


విగ్రహాలకు పూజలు చేస్తున్న దాతలు

రాష్ట్ర స్థాయి షూటింగ్‌బాల్ పోటీల్లో ప్రతిభ

సబ్బవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర స్థాయి 43వ సీనియర్ షూటింగ్‌బాల్ పోటీలు అనంతపురం జిల్లాలోని శ్రీనేతాజీ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ఈనెల 19 నుంచి 21 వరకు నిర్వహించారు. ఈ పోటీల్లో అనకాపల్లి జిల్లా తరఫున బాలుర టీం నుంచి 12 మంది, బాలికల టీం నుంచి 12 మంది పాల్గొన్నారని షూటింగ్ బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పైలా ప్రవీణ్ తెలిపారు. ఇరుజట్లు రన్నర్స్‌గా నిలిచాయని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు.


రన్నర్స్‌గా నిలిచిన అనకాపల్లి జిల్లా బాలురు, బాలికల జట్లు

ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు

వేపగుంట, న్యూస్‌టుడే: వేపగుంట జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు నాలుగు అర్జీలు వచ్చాయి. జెడ్సీ హేమవతి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని అర్జీదారులకు హామీ ఇచ్చారు. 98వ వార్డు అడివివరం గురుకుల పాఠశాలలోని మంచినీటి బోరుకు మరమ్మతులు చేయాలని, బీఆర్టీఎస్ రహదారిలో భూమి కోల్పోయిన తమకు టీడీఆర్‌లు ఇప్పించాలని, బీఆర్టీఎస్ రహదారి పక్కన భవన నిర్మాణానికి అనుమతులు ఇవ్వాలని, నరవ చర్చి వద్ద రోడ్డు ఆక్రమణలను తొలగించి సమస్య పరిష్కరించాలని అర్జీలు ఇచ్చారు. కార్యక్రమంలో డీఈ విజయ్‌కుమార్, ఏఎంహెచ్‌వో అప్పలనాయుడు, ఆర్‌వో నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.


అర్జీదారుల సమస్యలు వింటున్న జెడ్సీ హేమవతి

అభివృద్ధి పనుల పరిశీలన

వేపగుంట, న్యూస్‌టుడే: జీవీఎంసీ 94వ వార్డు పరిధిలోని పలు ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు సోమవారం పరిశీలించారు. వేపగుంట - పాతగోశాల రహదారి బస్టాప్ సమీపంలో ఓపెన్ జిమ్ పరికరాలు మరమ్మతులకు గురయ్యాయని, వాటిని తొలగించి కొత్త పరికరాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. అనంతరం గౌతంనగర్, కృష్ణరాయపురంలో నిర్మిస్తున్న డ్రైనేజీ నిర్మాణాన్ని పరిశీలించారు. నాణ్యతలో లోపం లేకుండా పనులు చేపట్టాలని గుత్తేదారు, ఇంజినీరింగ్ అధికారులకు సూచించారు. ఆయన వెంట మామిడి కిరణ్ తదితరులు ఉన్నారు.


ఓపెన్ జిమ్ పరికరాల ఏర్పాటును పరిశీలిస్తున్న కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావు